RNI NO. TELTEL/2021/81092
Published from Jagtial
Email: prajamantalu@gmail.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి (Volume) : 3 పేజీలు - 8
సంచిక (Issue) : 287 వెల - రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు
prajamantalu.com

మంగళవారం
28, ఫిబ్రవరి 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,

పదిరోజుల అమెరికా పర్యటనకు బయలు దేరిన మంత్రి కొప్పులఈశ్వర్ దంపతులు. అమెరికాలోని సాల్ట్ లేక్, వేగాస్ నగరాలలో పర్యటించి, అక్కడి తెలంగాణ ప్రజలతో సమావేశం అవుతారు.





# అభివృద్ది మా కులం.. సంక్షేమం మా మతం

- తెలంగాణకు పట్టిన అతిపెద్ద శని మోడీ
- మోడీ ఎవనికి దేవుడో బండి సంజయ్ చెప్పాలి
- 50 ఏళ్లు అధికారంలో కాంగ్రెస్ గాడిదపళ్లు తోమిందా
- ఒక్క చాన్స్ అంటూ మళ్లీ దేబురిస్తోంది
- తెలంగాణ ప్రజలు ఈ పార్లను నమ్మే పరిస్థితి లేదు
- ప్రజలంతా కెసిర్ కుటుంబమే
- స్టేషన్ ఘనాపూర్ సభలో మరోమారు కెటిఆర్ విమర్శలు

జనగామ,ఫిబ్రవరి27(ప్రజా మంటలు): అభివృద్ధి మా కులం..సంక్షేమం మా మతం అని మంత్రి కెటిఆర్ అన్నారు. 50 ఏళ్ల పాలనలో ఏమీ చేయని కాంగ్రెస్ దద్దమ్మలు మరోమారు ఛాన్స్ అంటూ వస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణకు పట్టిన శని మోడీ, బిజెపి అంటూ విరుచుకు పడ్డారు. ఏ ఒక్క మంచి పనిచేయకున్నా మోడీని దేవుడని పొగడుతున్న వారిని ఏమనాలని ఎద్దేవా చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో రూ. 125 కోట్లతో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శంకుస్థాపనలు చేసిన సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. కులం పంచాయతీ లేదు. మతం పిచ్చి లేదు. జనహితమే మా అభిమతం అని కేటీఆర్ స్పష్టం చేశారు. అభివృద్దే మా కులం, సంక్షేమమే మా మతం అని తేల్చిచెప్పారు. పల్లె ప్రగతి ద్వారా గ్రామాలు బాగుపడుతున్నాయి. పట్టణాలు బాగు పడుతున్నాయి. దేశంలో అత్యుత్తమ గ్రామాలు, మున్సిపాలిటీలు ఎక్కడ ఉన్నాయంటే తెలంగాణలో ఉన్నాయని కేంద్రమే చెబుతోంది. కేంద్రం మాటలు చెప్పడం తప్ప ఒక్క పైసా పని చేయలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. కుటుంబ పాలన అంటూ చేస్తున్న విమర్శలపై మరోమారు స్పందించారు. ముమ్మాటికి మాది కుటుంబ పాలనే అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. కేసీఆర్‌ను విమర్శిచేందుకు విపక్షాలకు కారణం దొరకట్లేదు. ఏ తప్పు దొరక్క కుటుంబ పాలన అని కేసీఆర్‌ను విమర్శిస్తున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి చెబుతున్నా.. మాది కుటుంబ పాలనే అని బరాబర్ చెబుతున్నా అని కేటీఆర్ స్పష్టం చేశారు. కోట్ల మంది తెలంగాణ ప్రజలంతా మా కుటుంబ సభ్యులే అని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రతి కుటుంబంలో కేసీఆర్ భాగస్వామినే. రైతులందరికీ పెద్దన్నలాగా కేసీఆర్ అండగా ఉన్నాడు. ఆసరా పెన్షన్లతో వృద్ధులను కడుపులో పెట్టుకున్నాడు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు పేదింటి ఆడబిడ్డలకు కేసీఆర్ మేనమామ అయిండు. కేసీఆర్ కిట్ పథకం అమలుతో సర్కార్ దవాఖానాలో ప్రసవాల కోసం క్యూ కడుతున్నారు. గురుకులాల్లో 6 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రపంచంతో పోటీ పడే విధంగా ఆ విద్యార్థులను తయారు చేస్తున్నారు అని కేటీఆర్ తెలిపారు. కొంత మంది రాజకీయ నిరుద్యోగులు పనికిమాలిన పాయదత్రాలు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతున్నారు అని కేటీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీకి ఒక్క చాన్స్ ఇవ్వండి అని పార్టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అడుక్కుంటున్నాడు. మీ దిక్కుమాలిన పార్టీకి 10 ఛాన్సులు ఇచ్చారు. మీ హయాంలో కరెంట్, నీళ్లు లేక తెలంగాణ రైతన్న ఆత్మహత్యల పాలయ్యారు. మీ మాటలకు పడిపోయేవారు ఎవరూ లేరు. తెలంగాణలో అమాయకులు ఎవరూ

మిగతా... 2లో



## త్వరలోనే స్టేషన్ ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీ చేస్తాం

- రూ.150కోట్లకుపైగా పనులను ప్రారంభించి, శంకుస్థాపన చేసిన మంత్రి కేటీఆర్
- వేలేరు మండలంలో మంత్రి కేటీఆర్

వేలేరు ఫిబ్రవరి 27 (ప్రజా మంటలు) : వేలేరు మండలం లోని పీచర క్రాస్ రోడ్డు వద్ద రూ.103 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న మూడు లిఫ్ట్ పైప్ లైన్ లకు రాష్ట్ర ఐటీ పరిశ్రమల, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు శంకుస్థాపన చేశారు. రూ.40 కోట్లతో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా పీచర క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన రైతు కృతజ్ఞతా బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రూ.103కోట్లతో మూడు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. స్టేషన్ ఘన్ పూర్ ను త్వరలోనే మున్సిపాల్టీగా

మిగతా... 2లో

## ప్రీతికి అన్యాయం చేసిన వాడిని శిక్షిస్తాం

సైఫ్ అయినా, సంజయ్ అయినా.. వదలం

స్టేషన్ ఘనాపూర్ సభలో మంత్రి కెటిఆర్ హెచ్చరిక

జనగామ,ఫిబ్రవరి27(ప్రజా మంటలు): పీజీ వైద్య విద్యార్థిని ప్రీతికి అన్యాయం చేసిన వాడు సైఫ్ అయినా, సంజయ్ అయినా.. ఎవడైనా సరే వదిలిపెట్టం.. చట్టపరంగా శిక్షిస్తామని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయంపై జిల్లా పర్యటనలో ఆయన ఘాటుగా

మిగతా... 2లో






## త్వరలో భారత్‌లోనే విమానాల తయారీ

- శివమొగ్గ విమానాశ్రయం ప్రారంభం
- ఎయిర్ పోర్టు నుంచి భారీ ర్యాలీగా వెళ్లిన ప్రధాని మోడీ

బెంగళూరు,ఫిబ్రవరి27(ప్రజా మంటలు): రాబోయే రోజుల్లో భారత్‌కు వేలాది విమానాలు అవసరం పడుతుందని ప్రధాని మోడీ తెలిపారు. ఈ రంగంలో వేలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్రస్తుతం విదేశాల నుంచి భారత్‌కు విమానాలు దిగుమతి అవుతున్నాయని.. త్వరలోనే విమానాలను భారత్‌లోనే తయారు చేస్తామని మోడీ పేర్కొన్నారు.కర్ణాటకలోని శివమొగ్గ ఎయిర్‌పోర్ట్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోడీ

మిగతా... 2లో




## ప్రిన్స్ ముకరంజా సతీమణి ఉదారత

- యాదాద్రీశ్వరుడికి 5లక్షల విలువైన బంగారం విరాళం

యాదగిరిగుట్ట,ఫిబ్రవరి27(ప్రజామంటలు): యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి దివంగత నిజాం ముకర్రం జా సతీమణి, యువరాణి బేగం సాహిబా ఎస్రా బిర్గెన్ భారీ విరాళం అందజేశారు. స్వామివారి వార్షిక

మిగతా... 2లో

## అగ్నిపథ్ స్కీంలో జోక్యం అనవసరం

పిటిషన్లను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి27 (ప్రజా మంటలు): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకం చెల్లుబాటును ఢిల్లీ హైకోర్టు సమర్థించింది. ఈ మేరకు అగ్నిపథ్ స్కీం విషయంలో ఢిల్లీ హైకోర్టు సోమవారం సంచలన తీర్పునిచ్చింది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సతీష్ చంద్ర శర్మ,జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం అగ్నిపథ్ రిక్రూట్‌మెంట్

మిగతా... 2లో




## ఉత్తమ ప్రణాళికలే ప్రగతికి పునాది

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్

హైదారాబాద్ ఫీబారవారి 27 (ప్రజా మంటలు): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పనలో, అమలులో, ఫలితాల సాధనలో రూపొందించే ఉత్తమ ప్రణాళికలే ప్రగతికి పునాదులు వేస్తాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ప్రణాళిక, అర్థ గణాంక శాఖ ఉన్నతాధికారులు, సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్, కాకతీయ

మిగతా... 2లో

## ప్రజానాడి




## సీఎం కేసీఆర్‌పై సుప్రీంకోర్టు అసంతృప్తి

- కేసు ఆడియో, వీడియోలను జడ్జిలకు పంపడంపై ఆక్షేపణ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి27(ప్రజా మంటలు): తెలంగాణ సీఎం కేసీఆర్‌పై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. తెలంగాణ సీఎం అనుసరించిన పద్ధతి



సరికాదని సుప్రీంకోర్టు సూచించింది. కేసు ఆడియో, వీడియోలను సీఎం ఎలా జడ్జిలకు పంపుతారని ప్రశ్నించింది. ఎమ్మెల్యేల కొను గోలు కేసు విచారణ సందర్భంగా జస్టిస్ గబాయి ధర్మాసనం వ్యాఖ్యలు చేసింది. న్యాయమూర్తులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలంగాణ

మిగతా... 2లో




## జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా ఖుష్బూ

- కేంద్ర ప్రభుత్వం నియామకం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి27(ప్రజా మంటలు): సినీ నటి, బీజేపీ నాయకురాలు ఖుష్బు సుందర్ జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా నామినేట్ అయ్యారు. ఖుష్బుతో పాటు మమతా కుమారిల్, డెలినా ఖోంగ్ డుప్ అనే మరో ఇద్దరు మహిళలను కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. వీళ్లు మూడు సంవత్సరాల పాటు సభ్యులుగా కొనసాగ నున్నారు. ఖుష్బుకి మెంబర్‌గా పదవి దక్కడంపై తమిళనాడు బీజేపీ చీఫ్

మిగతా... 2లో



## ఖాతాదారులపై ఛార్జీల దాడి

- మొండి బకాయిలపై నిర్లక్ష్యం
- అన్ని బ్యాంకులదీ అదే తీరు

ముంబయి,ఫిబ్రవరి27(ప్రజా మంటలు): దేశంలో బ్యాంకులకు రుణాలు ఎగవేసిన వారి విష యంలో ఎలాంటి చర్యలు

మిగతా... 2లో





# నా బిడ్డది.. ఆత్మహత్యకాదు...హత్యే

ప్రీతిని పనిగట్టుకుని వేధించారు

వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని మరీ వేధింపులు

గిరిజన అమ్మాయి కావడం వల్లనే ఇలా జరిగింది

ప్రీతి సోదరి పూజ ఆరోపణలు

మ కుమార్తెది హత్యే అన్న తండ్రి

జనగామ,ఫిబ్రవరి27(ప్రజా మంటలు): కాకతీయ మెడికల్ కాలేజీకి చెందిన పీజీ మొదటి సంవత్సరం పిజి విద్యార్థిని ధారావత్ ప్రీతి ఆత్మహత్యపై ఆమె సోదరి పూజ సంచలన వ్యాఖ్యలు చేసింది. తన సోదరి మృతిపై అనేక అనుమానాలున్నాయని తెలిపింది. గిరిజన తెగకు చెందిందనే అందరూ కలిసి తన చెల్లిని ఒంటరి చేశారని పేర్కొంది. అవమానించారని అన్నారు. ఏకంగా అందరూ వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేసుకుని తన చెల్లిపై చర్చించుకునేవారని తెలిపింది. తోటి పీజీలు, సీనియర్లు అంతా ఒక్కటై తన చెల్లిని వేధించారని పేర్కొంది. విషయంపై హెచ్‌ఓడీ, ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపింది. పోలీసుల విచారణ మధ్యలో ఎందుకు ఆపాల్సి వచ్చిందని

మిగతా... 2లో

## ముగిసిన ప్రీతి అంత్యక్రియలు

అశ్రునయనాలతో వీడ్కోలు పలికిన ప్రజలు

పాడె మోసిన పలువురు ప్రజాప్రతినిధులు

జనగామ,ఫిబ్రవరి27(ప్రజా మంటలు): ఆత్మహత్య చేసుకున్న మెడికో ప్రీతి అంత్యక్రియలు స్వగ్రామంలో ముగిశాయి. అశృనయనాల మధ్య ప్రీతికి కుటుంబ సభ్యులు, బంధువులు, పార్టీలు, ప్రజాసంఘాల నేతలు కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రీతి మృతితో గిర్నితండా కన్నీటి సంద్రంగా మారింది. అయితే ప్రీతి అంత్యక్రియల్లో పోలీసులు ఓవరాక్షన్ చేశారు. విపక్ష నేతలను అంత్యక్రియల్లో పాల్గొనకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ప్రీతి అంత్యక్రియల్లో

మిగతా... 2లో

## సీఎం కేసీఆర్‌పై
# సుప్రీంకోర్టు అసంతృప్తి

మొదటి పేజీ తరువాయి..
సర్కార్ తరపున న్యాయవాది దుష్యంత్ దవే పేర్కొన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసు ఆడియో, వీడియో క్లిప్పులను సుప్రీం కోర్టు జడ్జిలు సహా దేశంలోని ప్రముఖులకు కేసీఆర్ పంపారు.

కాగా కేసు వివరాల్లోకి వెళ్తే, ఎమ్మెల్యేలకు ఎర వ్యవహారంపై దర్యాప్తును సీబీఐకి తెలంగాణ హైకోర్టు అప్పగించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును తెలంగాణ ప్రభుత్వం ఆశ్రయించింది. సీబీఐ చేతిలోకి కేసు వెళ్తే ఇప్పటి వరకు చేసిన విచారణ అంతా పక్కదారి పడుతుందని టీఎస్ ప్రభుత్వం తరపున సీనియర్ లాయర్లు సిద్దార్థ లూత్రా, దుష్యంత్ దవేలు వాదనలు వినిపించారు. ఈ కేసులో ఆధారాలన్నీ బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో కేసును సీబీఐకి ఎలా అప్పగిస్తారని వాదించారు. కేసుపై వాదించేందుకు తనకు మరింత సమయం కావాలని కోరారు. మరోవైపు కేసులో కీలక ఆధారాలు లీక్ చేశారన్న విషయాన్ని ప్రతివాదుల తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన జస్టిస్ గవాయ్.. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ఆధారాలను మీడియాకే కాదు.. జడ్జీలకు పంపారని అన్నారు.

## ప్రీతికి అన్యాయం చేసిన వాడిని శిక్షిస్తాం

మొదటి పేజీ తరువాయి..
స్పందించారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో రూ. 125 కోట్లతో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శంకుస్థాపనలు చేసిన సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. ప్రీతి ఆత్మహత్య విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయాలపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇవాళ ప్రతి చిన్న అంశాన్ని రాజకీయం చేస్తున్నారు అని కేటీఆర్ మండిపడ్డారు. వరంగల్ ఎంజీఎంలో పీజీ చదువుతున్న డాక్టర్ ప్రీతి దురదృష్టావశాత్తూ కాలేజీలో జరిగిన గొడవల్లో మనస్తాపానికి గురై ఆ అమ్మాయి చనిపోయింది. ఆ అంశాన్ని కూడా రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ అమ్మాయి చనిపోతే అందరం బాధపడ్డాం. మంత్రులు సత్యవతి రాథోడ్, దయాకర్ రావు, ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఎంపీ కవిత వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ వేదిక నుంచి ప్రీతి కుటుంబానికి తమ పార్టీ, ప్రభుత్వం తరఫున మనస్ఫూర్తిగా సంతాపం ప్రకటిస్తున్నాం. కొంత మంది రాజకీయంగా చిల్లరమల్లర మాటలు మాట్లాడొచ్చు కానీ తాము ప్రభుత్వం, పార్టీ పరంగా ఆ కుటుంబానికి అండగా ఉంటాం. ఆ అమ్మాయికి అన్యాయం చేసిన వాడు ఎవడైనా సరే.. వాడు సైఫ్ కావొచ్చు.. సంజయ్ కావొచ్చు.. ఇంకెవడైనా సరే.. వదిలిపెట్టం అని ఘాటుగా హెచ్చరించారు. తప్పకుండా చట్టపరంగా, న్యాయపరంగా శిక్ష వేస్తాం అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం అన్నారు. ప్రతి చిన్న అంశాన్ని రాజకీయం చేయడం, చిల్లరమల్లర మాటలు మాట్లాడటం సరికాదని కేటీఆర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కడియం శ్రీహరి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిపథ్ స్కీంలో జోక్యం అనవసరం

మొదటి పేజీ తరువాయి..
పథకాన్ని సవాలు చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను కొట్టివేసింది. భారత బలగాల రిక్రూట్ మెంట్ కోసం కేంద్రం అమలు చేస్తున్న అగ్నిపథ్ పథకం చెల్లుబాటును ఢిల్లీ హైకోర్టు సోమవారం సమర్థించింది. అగ్నిపథ్ పథకంలో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణం లేదని హైకోర్టు పేర్కొంది. గత ఏడాది డిసెంబర్ 15న తన ఆదేశాలను రిజర్వ్ చేసింది. గత ఏడాది జూన్ 14న ప్రకటించిన అగ్నిపథ్ పథకం సాయుధ దళాలలో యువకుల రిక్రూట్‌మెంట్ కోసం నియమాలను నిర్దేశించింది. ఈ పథకాన్ని ఆవిష్కరించిన తర్వాత, ఈ పథకానికి వ్యతిరేకంగా పలు రాష్ట్రాల్లో నిరసనలు వెల్లు వెత్తాయి. తర్వాత ప్రభుత్వం 2022లో రిక్రూట్‌మెంట్ కోసం గరిష్ట వయోపరిమితిని 23 ఏళ్లకు పొడిగించింది. 2022వ సంవత్సరం జులై నెలలో ఈ పథకాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లను సుప్రీంకోర్టు ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేసింది.

## మహారాష్ట్ర బిఆర్ఎస్ కిసాన్ సెల్
### అధ్యక్షుడిగా మాణిక్ కదమ్ నియామకం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (వెలుతురు): బీఆర్ఎస్ మహారాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా మాణిక్ కదమ్‌ను ఆ పార్టీ అధినేత కేసీఆర్ నియమించారు. దేశ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్‌ను స్థాపించినట్టు చెబుతున్న అధినేత కేసీఆర్.. పార్టీ విస్తరణపై దృష్టిసారించారు. ఇందులో భాగంగా ఈ నెల 6న మహారాష్ట్రలోని నాందేడ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. తాజాగా మహారాష్ట్ర బీఆర్ఎస్ కిసాన్ సెల్ అధ్యక్షుడిగా మాణిక్ కదమ్‌ను నియమించారు. ఈ మేరకు నిన్న ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో కిసాన్ సెల్ అధ్యక్షుడిగా జాతీయ రైతు సంఘం నేత గుర్నాంసింగ్ చడూనీని నియమించిన విషయం తెలిసిందే. కాగా, మహారాష్ట్రలోని ముంబైలో కల్వకుంట్ల కవిత శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర అభివృద్ధిలో బీఆర్ఎస్ పార్టీ కీలక భాగస్వామి అవుతుందని చెప్పారు. ఇక్కడి ప్రజల కోసం తాము పనిచేస్తామని ప్రకటించారు. బీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చినప్పటి నుండి కేసీఆర్ పూర్తిగా దేశ రాజకీయాలపై దృష్టి సారించారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ నినాదంతో దేశం దృష్టిని ఆకర్షించే యత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ తీసుకున్న కీలక నిర్ణయాల్లో మహారాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడి నియామకం ఒకటిగా చెబుతున్నారు. మొదట తెలంగాణ చుట్టూ ఉన్న రాష్ట్రాలపై గులాబీ బాస్ ఫోకస్ పెట్టినట్టు చెబుతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ సహా పలు రాష్ట్రాల్లో కార్యకలాపాలు విస్తరించేలా ప్రణాళికలు రచిస్తోంది కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్. ఇందులో భాగంగా పార్టీ కార్యకలాపాలకు కార్యాలయాలను సిద్ధం చేస్తూ రాష్ట్రాల బాధ్యతలను పలువురికి అప్పగిస్తున్నారు.

## స్థలాలు ఉన్న వారికి ఇళ్ల నిర్మాణం
### 3లక్షల సాయంపై కేబినేట్ సబ్ కమిటీ చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ప్రజామంటలు): ఇండ్ల స్థలాలు, సంబంధిత అంశాల పరిష్కారంపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయింది. హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో పురపాలక శాఖ మంత్రి మంత్రి



కేటీఆర్ నేతృత్వంలో ఈ సమావేశం కొనసాగుతున్నది. ఇండ్ల స్థలాలు, 58, 59 ఉత్తర్వుల కింద క్రమబద్ధీకరణ సహా సంబంధిత అంశాలపై ఈ భేటీలో చర్చించే అవకాశం ఉంది. సమావేశంలో మంత్రులు హరీశ్ రావు, శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, పువ్వాడ అజయ్, మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇదే అంశపై ఈనెల 13న కేబినెట్ సబ్‌కమిటీ భేటీ అయిన విషయం తెలిసిందే. 2023-24 వార్షిక బడ్జెట్‌లో సొంత స్థలాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించుకునేందుకు రూ. 7350 కోట్లు కేటాయించింది. కుటుంబానికి రూ. 3 లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం అందించనున్నది. ఈ ఏడాది మొత్తం 4 లక్షల మంది లబ్ధిదారులకు సాయం అందించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 1,78,200 మందికి, పట్టణ ప్రాంతాల్లో 2,21,800 మంది చొప్పున సాయం అందిచనున్నారు.

# నా బిడ్డది ఆత్మహత్యకాదు...హత్యే

మొదటి పేజీ తరువాయి..
ప్రశ్నించింది. నిజా నిజాలు నిగ్గుతేలాలని ప్రీతి సోదరి పూజ డిమాండ్ చేసింది. ప్రీతి తండ్రి నరేందర్ సైతం నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హెచ్ఓడీని సైతం సస్పెండ్ చేయాలని కోరుతున్నారు. వారిని సస్పెండ్ చేస్తేనే ప్రీతి ఆత్మకు



శాంతి చేకూరుతుందని తెలిపారు. సైఫే తన కూతురికి ఇంజక్షన్ ఇచ్చి చంపేశాడని ఆరోపించారు. ప్రీతిది ఆత్మహత్యకాదని.. హత్యఅని ఆయన కన్నీరు మున్నీరయ్యారు. ఇక ప్రీతి మృతదేహాన్ని నేటి తెల్లవారుజామున ఆమె స్వగ్రామం జనగామ జిల్లా కొడగండ్ల మండలం..మొండ్రాయి గిర్నితండాకి తరలించారు. ఆమె అంత్య క్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రీతి మృతితో ఆమె స్వగ్రామంలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి. ఎంజీఎంలోని అనస్థీషియా విభాగంలో పని చేస్తున్న ప్రీతి తన సీనియర్ పీజీ విద్యార్థి ఎంఏ సైఫ్ వేధింపులు భరించలేక మత్తుకు సంబంధించిన ఒక ఇంజక్షన్ తీసుకోవడం ద్వారా ఈనెల 22న ఉదయం ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. అత్యవసర ఆపరేషన్ థియేటర్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను మొదట ఎంజీఎం ఆస్పత్రిలోనే అత్యవసర చికిత్స అందించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అదే రోజు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అప్పటి నుంచి అక్కడే చికిత్స పొందింది. నిమ్స్‌లో చేర్చినప్పటి నుంచి ప్రీతి ఆరోగ్య పరిస్థితి ఏ మాత్రం మెరుగుపడలేదు. ప్రత్యేక బృందం ఆమె ప్రాణాలను కాపాడేందుకు విశ్వప్రయత్నం చేశారు. ఆమె అవయవాలన్నీ దెబ్బతినడం వల్ల చికిత్సకు ఏ మాత్రం స్పందించలేకపోయాయి. ఈ క్రమంలో ఆదివారం మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

### వరంగల్ కేఎంసీ వద్ద పరిస్థితి ఉద్రిక్తం

వరంగల్ కేఎంసీ వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాకతీయ మెడికల్ కాలేజీకి చెందిన పీజీ మొదటి సంవత్సరం విద్యార్థిని ధారావత్ ప్రీతికి న్యాయం చేయాలంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. నేడు తెలంగాణ వ్యాప్తంగా మెడికల్ కళాశాలల బంద్‌కు ఏబీవీపీతో పాటు ఓయూ జేఏసీ పిలుపు నిచ్చాయి. ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను ఉరి తీయాలని డిమాండ్ చేసారు.. విద్యార్థులను అరెస్ట్ చేసేందుకు పోలీసులు యత్నించగా స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసుల తీరుపై ఏబీవీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదు రోజులుగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో మృత్యువుతో చేస్తున్న పోరాటంలో ప్రీతి ఓడిపోయింది. డాక్టర్ల బృందం చివరి నిమిషం వరకు ఎంత ప్రయ త్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఆదివారం సాయంత్రం ఆమె కన్ను మూసింది. ప్రీతి మృతితో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఆమె మరణవార్తతో కేఎంసీలోని వైద్య విద్యార్థులు కన్నీటి పర్యంతం అయ్యారు. ఎంజీఎం ఆస్పత్రిలోనూ సీనియర్ డాక్టర్లు, పీజీలు, హౌస్‌సర్జన్లు సైతం విషాదంలో మునిగిపోయారు. సోమవారం తెల్లవారుజామున గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తయిన వెంటనే ప్రీతి మృతదేహాన్ని ఆమె స్వగ్రామం జనగామ జిల్లా కొడగండ్ల మండలం..మొండ్రాయి గిర్నితండాకి తరలించారు. ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

# త్వరలో భారత్‌లోనే విమానాల తయారీ

మొదటి పేజీ తరువాయి..
ప్రారంభించారు. యడ్యూరప్ప పుట్టినరోజునే ఈ ఎయిర్‌పోర్ట్‌ను మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా యడ్యూరప్పకు మోడీ



అభినందనలు తెలిపారు. ఎయిర్ పోర్టులో చేపట్టిన మరికొన్ని అభివృద్ధి పనులకు మోడీ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎయిర్ పోర్టు మొత్తం కలియతిరిగారు. ఈ ఏడాది కర్ణాటకలో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ప్రధాని మోడీ భారీ రోడ్ షోను నిర్వహించారు. ఎయిర్ పోర్టును ప్రారంభించిన తర్వాత బెలగావి నగరంలో 10.7 కిలోమీటర్ల భారీ రోడ్ షోలో పాల్గొన్నారు. కారు ఎక్కి రోడ్డుకు ఇరువైపులా నిల్చున్న అభిమానులకు అభివాదం చేశారు. చన్నమ్మ సర్కిల్ నుంచి ధర్మవీర శంభాజీ సర్కిల్, రామలింగ ఖిండ్ గల్లీలోని అశోక సర్కిల్, తిలక్ సర్కిల్ దగ్గర అభిమానులు మోడీపై పూల వర్షం కురిపించారు. జై మోడీ నినాదాలతో రోడ్ షో హోరెత్తింది. శివమొగ్గ ఎయిర్ పోర్టు మాజీ సీఎం యడ్యూరప్ప కలల ప్రాజెక్టు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి నిధులు తీసుకొచ్చారు. శివమొగ్గ ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ఉడాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది.

శివమొగ్గ విమానాశ్రయాన్ని 775 ఎకరాల్లో దాదాపు రూ. 449 కోట్లతో నిర్మించారు. ఎయిర్‌పోర్ట్‌కు కర్ణాటక కవి, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత కువెంపు పేరు పెట్టారు. ఈ విమానాశ్రయం గంటకు 300 మంది ప్రయాణికులను చేరవేస్తుంది. బెంగళూరులో ఉన్న కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత అతిపెద్ద రన్ వే ఉన్న విమానాశ్రయం ఇదే. తాజా ఎయిర్‌పోర్ట్‌తో కర్ణాటక రాష్ట్రంలో ఎయిర్ పోర్టుల సంఖ్య తొమ్మిదికి చేరాయి. బెంగళూరు, బళ్లారి, బెళగావి, కలబురిగి, మైసూరు, మంగళూరుల సరసన శివమొగ్గ ఎయిర్‌పోర్ట్ చేరింది.

# అభివృద్ధి మా కులం.. సంక్షేమం మా మతం

మొదటి పేజీ తరువాయి..
లేరు అని కేటీఆర్ స్పష్టం చేశారు. 50 ఏండ్లు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే ఏం చేశారు అని కేటీఆర్ నిలదీశారు. 24 గంటల కరెంట్ రైతులకు ఇవ్వాలన్న సోయి మీకు వచ్చిందా? ఒక్కో ఎకరానికి రూ. 5 వేల చొప్పున రైతుబంధు ఇవ్వాలన్న ఆలోచన ఎందుకు రాలేదు? రైతులకు బీమా కల్పించాలనే ఆలోచన ఎందుకు రాలేదు? కరెంట్, సాగు, తాగు నీరు ఇవ్వరు.. ఇప్పుడేమో ఎగతాళిగా మాట్లాడుతూ.. ఒక్క ఛాన్స్ ఇవ్వండి అని అడుక్కుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక్క పని కూడా చేయని కాంగ్రెస్ కు రేవంత్ రెడ్డి ఒక్క చాన్స్ అడగడం అవివేకమని కేటీఆర్ అన్నారు. హంతకుడే సంతాపం చెప్పినట్లు రేవంత్ రెడ్డి మాటలున్నాయన్నారు. రేవంత్ రెడ్డి రెచ్చగొట్టే మాటను ఎవ్వరూ నమ్మరని చెప్పారు. 50 ఏళ్లు కాంగ్రెస్ కు అధికారం ఇస్తే గుడ్డి గుర్రం పండ్లు తోమారా అంటూ ఎద్దేవా చేశారు. స్టేషన్ ఘన్ పూర్ లో ఎగిరేది మళ్లీ బీఆర్ఎస్ జెండానే అని చెప్పారు. ఇకపోతే ప్రధాని మోడీ ఎవరికి దేవుడు.. ఎందుకు దేవుడని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధికి అడుగడుగునా అడ్డం పడుతున్నం దుకు మోడీ దేవుడా? అని ప్రశ్నించారు. ఆదానికి దేవుడు కావొచ్చు కానీ.. తెలంగాణ ప్రజలకు దేవుడు కాదన్నారు. బీజేపీకి హిందు.. ముస్లీం తప్ప మరోకటి తెల్వదన్నారు. కిషన్ రెడ్డికి మైండ్ మోకాళ్లలో ఉందో అరికాళ్లలో ఉందో అర్థం కాదని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో పంజాబ్, హర్యానాతో తెలంగాణ రైతుల పోటీ పడుతున్నారు. చెరువులను బాగు చేసి, సాగునీరు అందించి, ఉచిత కరెంట్ ఇవ్వడం ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. గతంలో తాగునీరు ఇవ్వకుండా మహిళలను ఇబ్బంది పెట్టారు. కానీ కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా నీళ్లు అందించి, నీటి గొడవలకు స్వస్తి పలికారు అని కేటీఆర్ తెలిపారు. కడియం శ్రీహరి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రణాళికలే ప్రగతికి పునాది

(మొదటి పేజీ తరువాయి)
గవర్నెన్స్ ఫెలోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ప్రణాళిక, అర్థ గణాంక శాఖ, సిజిస్, కే.జి.ఎఫ్ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే. రామ కృష్ణారావు, అమెరికా కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కార్తిక్ మురలీధరన్, అర్థ గణాంక శాఖ డైరెక్టర్ దయానంద్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు సమర్థవంతంగా అందే విధంగా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో కీలకమైన ప్రణాళిక, అర్థ గణాంక శాఖ అధికారులు, సీజిస్, కే.జీ.ఎఫ్ బృందాలు ఉత్తమ ప్రణాళికలతో పని చేయాలని, అప్పుడే ప్రగతికి గట్టి పునాదులు పడతాయని వినోద్ కుమార్ అభిప్రాయ పడ్డారు.

ప్రణాళికా శాఖ పట్ల సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా అధికారులు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వినోద్ కుమార్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఆర్థిక, ప్రణాళికా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణా రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో అమలు జరుగుతున్న తీరు తెన్నులను సూక్ష్మ స్థాయిలో పరిశీలించి పక్కాగా నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు.

# ముగిసిన ప్రీతి అంత్యక్రియలు

మొదటి పేజీ తరువాయి..
కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆపై గొడవ సర్దుమణిగింది. మందకృష్ణ మాదిగ బీఆర్ఎస్ , బీజేపీ నేతలు పాడె పట్టారు. ప్రీతి అంత్యక్రియల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రీతకి న్యాయం జరగాలని అంటూ నినాదాలు ఇచ్చారు. కాకతీయ మెడికల్ కాలేజీకి చెందిన పీజీ మొదటి సంవత్సరం విద్యార్థిని ధారావత్ ప్రీతి కథ విషాదంగా ముగిసింది. ఐదు రోజులుగా హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడిన ఆమె ఆదివారం రాత్రి 9.10 గంటలకు తుదిశ్వాస విడిచారు. డాక్టర్ల బృందం ఆమెను కాపాడేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఎంజీఎం అనస్థీషియా విభాగంలో పని చేస్తున్న ప్రీతి తన సీనియర్ ఎంఏ సైఫ్ వేధింపులు భరించలేక ఈనెల 22న ఉదయం మత్తు ఇంజక్షన్ తీసుకుంది. అత్యవసర ఆపరేషన్ థియేటర్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెకు ఎంజీఎంలోనే చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో అదే రోజు నిమ్స్‌కు తరలించారు. అప్పటికే ఆమె గుండె పనితీరు మందగించడంతో ఎంజీఎంలో సీపీఆర్ నిర్వహించారు. హైదరాబాద్‌కు తరలించిన తర్వాత రెండుసార్లు నిమ్స్ వైద్యులు కూడా సీపీఆర్ చేశారు. నిమ్స్‌లో చేరినప్పటి నుంచీ ప్రీతి ఆరోగ్యం ఏ మాత్రం మెరుగుపడలేదు. ఆమె అవయవాలన్నీ దెబ్బతినడం వల్ల చికిత్సకు ఏ మాత్రం స్పందించలేకపోయాయి. ఆరోగ్యం అంతకంతకూ క్షీణిస్తూ వచ్చింది. ప్రీతిని రక్షించేందుకు నిమ్స్ వైద్యులు యత్నించినప్పటికీ నిన్న రాత్రి ప్రీతి తుదిశ్వాస విడిచారు.

## ప్రిన్స్ ముకరంజా సతీమణి ఉదారత

మొదటి పేజీ తరువాయి..
బ్రహ్మోత్సవాల సందర్భంగా సుమారు రూ.5లక్షల విలువైన 67 గ్రాముల బంగారు ఆభరణాలను విరాళం ఇచ్చారు. యువరాణి ఎస్రా తరపున.. యాదాద్రి ఆలయ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ జి కిషన్ రావు.. నగలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ గీతకు అందించారు. లండన్‌లో నివసిస్తున్న యువరాణి ఎస్రా తరచుగా హైదరాబాద్‌కు, ఆమె స్వదేశమైన టర్కీకి వెళుతూ ఉంటుంది. అయితే.. యువరాణి ఎస్రాతో కొన్నేళ్ల క్రితం ఆలయ పునర్నిర్మాణ ప్రాజెక్టు గురించి చర్చించినప్పుడు.. ఆమె ఆలయాన్ని సందర్శించడానికి ఆసక్తి చూపించారు. గతేడాది ప్రారంభంలో ఆలయం తిరిగి తెరిచిన తర్వాత మీడియాలో ఆలయ చిత్రాలు, వీడియోలు వైరల్ కావడంతో.. అవి చూసిన ఆమె ఆలయానికి విరాళం ఇవ్వాలని అనుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఆమె ఆలయ అధికారులకు కిషన్ రావుతో బంగారు ఆభరణాలను పంపించారు. అంతకుముందు యువరాణి ఎస్రా యాదాద్రి ఆలయాన్ని సందర్శించాలని భావించారు. కాని అదే సమయంలో ముకర్రం జా మరణించడంతో ఆమె ఆలయ సందర్శనకు రాలేదు. ఇక యాద్రాద్రి లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

## జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలిగా ఖుష్బూ

మొదటి పేజీ తరువాయి..
అన్నామలై అభినంద నలు తెలిపారు. ఇది ఆమె పట్టుదల, మహిళలకు హక్కుల కోసం చేస్తున్న పోరాటానికి దక్కిన గుర్తింపు అని అన్నారు. మరో వైపు తనకు ఇంత పెద్ద బాధ్యతను అప్పగించినందుకు ఖుష్బు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపారు. మోడీ నాయకత్వంలో నారీ శక్తిని పరిరక్షించడానికి, సంరక్షించడానికి, పోషించడానికి తాను తీవ్రంగా కృషి చేస్తానని అన్నారు. నటి, సినీ నిర్మాత, టెలివిజన్ ప్రెజెంటర్ అయిన ఖుష్బు మొదట డీఎంకేలో చేరారు. తర్వాత కాంగ్రెస్ లో చేరారు. చివరికి బీజేపీలో చేరి 2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. డీఎంకే అభ్యర్థి ఎన్ ఎజిలన్ చేతిలో ఆమె ఓడిపోయారు.

## ఖాతాదారులపై ఛార్జీల దాడి

మొదటి పేజీ తరువాయి..
కానరావడం లేదు. కొందరు దేశం విడిచి పారిపోయారు. వారు ఇప్పట్లో తిరిగి వస్తారని కానీ, ఎగవేసిన రుణాలను చెల్లిస్తారన్ ఆశలు మాత్రం కానరావడం లేదు. ఇకపోతే కాలక్రమేణా బ్యాంకులు సామాన్యలకు దూరం అవుతున్నాయి. రకరకాల ఛార్జీలతో ఖాతాదారులను వేధిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముఖగా ఉన్న బ్యాంకింగ్ రంగంలో నూతన విధానాలు అమలు చేయడంలో ఆలస్యం వల్ల బ్యాంకులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. నిర్వహణ వ్యయం పెరగడం, ప్రాజెక్టులకు తగు సమయంలో అనుమతులు లభించకపోవడం తదితర పరిణామాలు కంపెనీల చెల్లింపులపై ఒత్తిడిని పెంచాయి. ఇప్పటికే బ్యాంకులు మొండి బాకీల కింద కేటాయింపులు చేశాయని క్రిసిల్ రిపోర్టులో పేర్కొంది. తాజాగా మరో 20 శాతం పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నష్టాలను తట్టుకోవడానికి బ్యాంకులకు సరిపడ మూలధనం అవసరం ఉంటుంది. కొత్త నిధులు లభిస్తేనే రుణాల మంజూరులో వృద్ధికి దోహదం చేయనుంది. లేనిచో బలహీన వృద్ధికి కారణం కానుంది. మొండి బాకీల భారం సామాన్యులపై భారీగా పడుతోంది. వాటి నష్టాన్ని పూడ్చుకోవడానికే అన్నట్లుగా బ్యాంకులు ఖాతాదారులపై ఇష్టం వచ్చినట్లుగా ఛార్జీలు వేస్తున్నారు. పెద్దనోట్ల రద్దు తరవాత ఆయా బ్యాంకులు విధిస్తున్న ఛార్జీలు చూస్తే బ్యాంక్ ఖాతా లేకపోవడమే ఉత్తతమని భావిస్తున్నారు. మరోవైపు పాతబకాయిల వసూలుకు సంబంధించి నిర్దుష్ట విధానం అవలంబించడం లేదు. మొండిబకాయిదారుల పేర్లను వెల్లడించాలని గతంలో సుప్రీం ఆదేశించిన ఎందుకనో ఆర్‌బిఐ ముందుకు రావడం లేదు. మొత్తంగా మొండిబకాయిల దెబ్బకు బ్యాంకుల నడ్డి విరుగుతోంది. దేశంలోని 50 అతిపెద్ద రుణ ఖాతాల మొండి బాకీల వల్ల వివిధ బ్యాంకులు దాదాపుగా రూ. 2.4 లక్షల కోట్లు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ గతంలోనే విశ్లేషించింది. ఈ నివేదిక ప్రకారం యాభై కంపెనీలకు ఇచ్చిన అప్పుల్లో మొండి బాకీలుగా మారిన మొత్తంలో 60 శాతం మేర రద్దు చేసుకోవాల్సిన దుస్తితి నెలకొంది. వీటి మొండిబకాయిలు రూ. 4 లక్షల కోట్ల మేర ఉన్నాయి. 50 కంపెనీల్లో 30 శాతం అప్పులు మెటల్ రంగానివే అని గుర్తించారు. నిర్మాణ రంగం 25 శాతం, విద్యుత్ 15 శాతం చొప్పున బ్యాంకులకు నిరర్థక ఆస్తులను మిగిల్చాయి. 2017 మార్చి 31 నాటికి బ్యాంకుల మొత్తం మొండి బాకీలు రూ. 8 లక్షల కోట్లలో ఈ 50 కంపెనీల వాటా దాదాపుగా సగం మేర ఉన్నాయి. మొత్తం నిరర్థక ఆస్తుల్లో కనీసం సగానికి పైగా రుణాలు ఈ రంగాలివే. భారత జిడిపిలో ఇవి 5 శాతం. ఆర్థిక విలువ ఆధారితంగా ఈ రైటాఫ్ విలువను లెక్కించామని క్రిసిల్ రేటింగ్స్ చీఫ్ వెల్లడించారు. చివరిగా తీసుకునే రైటాఫ్ విలువ, బ్యాంకుల అంచనాలు, సబ్సిడరీలు వాల్యుయేషన్, కమోడిటీతో మిళితమయ్యే రంగాల ధరల అవుట్‌లుక్‌తో ప్రభావితమై ఉంటుందని క్రిసిల్ వివరించింది. ఈ కంపెనీలన్నీ వ్యాపారంలో సమగ్రత కలిగిలేవని పేర్కొన్నారు.

# త్వరలోనే స్టేషన్ ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీ చేస్తాం

మారుస్తామని, డిగ్రీ కాలేజీ మంజురికి సిఫారసు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. వేలేరు, ధర్మసాగర్, చిల్పూర్ మండలాల్లోని ఎగువ ప్రాంత గ్రామాలకు సాగునీరు అందించేందుకు రూ.103 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ ప్రణాళికల్లో భాగంగా మొదటగా గండి రామారం రిజర్వాయర్ వద్ద పంప్ హౌస్ నిర్మాణంతో పాటు కన్నారం ట్యాంక్ వరకు పైప్ లైన్ నిర్మాణంతోపాటు కన్నారం వద్ద లిఫ్టు నిర్మాణం చేపట్టనున్నారని తెలిపారు. హన్మకొండ జిల్లా వేలేరు మండలంలో రూ. 150 కోట్ల విలువైన పలు పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించి, మరికొన్ని పనులకు శంకుస్థాపన చేశారు.



కన్నారం, పీచర, మద్దెలగూడెం, కొండాపూర్, లింగంపల్లి, శ్రీపతిపల్లి, జనగామ జిల్లాలోని అబ్దుల్ నాగారం, నర్సాపురం, సోలిపురం, పోతారం, అంకుషాపురం కూటిగల్ లాంటి మొత్తం 14 గ్రామాల పరిధిలోని 3, 354 ఎకరాలకు రూ. 65 కోట్ల 54లక్షలతో సాగునీరు అందించే పైప్ లైన్ ఏర్పాటు చేయనున్నారు. రెండోది గుండ్లసాగరం రూ.9 కోట్ల 74లక్షలతో లిఫ్ట్ నిర్మాణం చేపట్టి పైపు లైన్ ద్వారా లోక్యతండా చెరువు నింపడం ద్వారా 1620 ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ఈ పైప్ లైన్ ద్వారా వేలేరు, శాలపల్లి, కమ్మరిపేట, బండతండా, మాటుతండా, చింతలతండా, ఎర్రబెల్లి, నారాయణగిరి, ముప్పారం గ్రామాల రైతులకు పైప్ లైన్ ద్వారా సాగునీరు అందుతుందని అన్నారు.

మూడో లిఫ్ట్ ఉప్పుగల్-నష్కల్ రిజర్వాయర్ వద్ద పంప్ హౌజ్ నిర్మించి లిఫ్ట్ ద్వారా రూ.31 కోట్ల 48లక్షల తో 1820 ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తైతే వేలేరు,ధర్మసాగర్, చిల్పూర్ ప్రాంతాల రైతుల సాగు నీటి సమస్య తీరుతుంది. వేల ఎకరాల బీడు భూమి సాగులోకి వస్తుందని తెలిపారు.

మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన ఎలా ఉందో ప్రజలు గమనించాలని కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వం లో 24 గంటల కరెంటు ఇస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు.

మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషం లో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ బీజేపీ పార్టీలు ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మాట్లాడుతూ స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గానికి 100 పడకల ఆసుపత్రి మంజూరు చేయాలని కోరారు.

ఘన్ పూర్ నియోజకవర్గంలో కొత్తగా రెండు మండలాలు ఇచ్చినందుకు సీఎం కేసీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు ఇంకో రూ.1000 కోట్లు ఖర్చు చేస్తే పూర్తవుతుందని అన్నారు. స్టేషన్ ఘన్ పూర్ ఎస్సీ నియోజకవర్గం పై మంత్రి కేటీఆర్ చల్లని చూపు ఉండాలని కోరారు. మూడు లిఫ్ట్ లు పూర్తైయితే స్టేషన్ ఘన్ పూర్ ప్రతి ఎకరానికి సాగునీరు అందుతుందని అన్నారు. ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ నాయకత్వం లో ఘన్ పూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, తెలంగాణ ఉద్యమం సమయంలో అధికార కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉద్యమం లో పాల్గొన్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, తమ ప్రాంతానికి సాగునీరు కోసం నిధులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమం చేసినప్పుడు ఈ ప్రాంత ప్రజలు ఉద్యమం లో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. ఈ సాగునీటి ప్రాజెక్టులు పూర్తైయితే రెండు పంటలకు సాగునీరు అందుతుందని తెలిపారు.

వేలేరు లో పర్యటించిన మంత్రి కేటీఆర్ వెంట మంత్రులు ఎర్రబెల్లి దయాకరరావు, సత్యవతి రాథోడ్ మంత్రి వెంట వచ్చారు. హెలిప్యాడ్ వద్ద ఎంపీలు దయాకర్, మాలోతు కవిత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ సీపీ రంగనాథ్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్,నన్నపనేని నరేందర్,చల్లా ధర్మారెడ్డి, శంకర్ నాయక్, వొడితెల సతీష్ కుమార్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, గండ్ర వెంకటరమణ రెడ్డి, ఆరూరి రమేష్, ఎంపీలు పసునూరి దయాకర్, జడ్పీ చైర్మన్ లు, రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్‌లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కంటి వెలుగు ముగింపు

**-బీరెడ్డి జార్జ్ రెడ్డి**


**తరిగొప్పుల ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండవ విడత ముగింపు కార్యక్రమం మండలం లోని మరియాపురం గ్రామంలో సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బీరెడ్డి జార్జ్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కంటి సమస్యల నిర్మూలన



లో భాగంగా ప్రభుత్వ చేపట్టిన బృహత్తరమైన కార్యక్రమం కంటి వెలుగు పట్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నారని పేర్కొన్నారు. ఈ శిబిరం లో సేవలందించిన ఆరోగ్యశాఖ సిబ్బందికి సన్మానం చేసి చిరు బహుమానాలను అందించారు. ఇంతటి మహత్తర కార్యక్రమం చేపట్టి ప్రజలకు సేవలు అందించిన ముఖ్యమంత్రి కేసీఆర్ కు, జనగామ నియోజకవర్గ శాసన సభ్యులు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.సి. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవితేజ, క్యాంపు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజయ్ కుమార్, సూపర్వైజర్ ఎన్ శ్రీను, హెల్త్ అసిస్టెంట్ ఏం వేణు, ఏఎన్ఎమ్ ఎస్ రాధిక, ఆప్తామిక్ అసిస్టెంట్ కే జగదీష్ , డిఈఓ అక్రమ్, ఆశ వర్కర్స్ కే కల్పన, స్వప్న, కనక లక్ష్మి, సంపూర్ణ గ్రామ పాలకవర్గ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గొడిశల రవి గౌడ్ కుటుంబానికి 100 కేజీల బియ్యాన్ని అందించిన ఎంపీటీసీ

**జనగామ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** జనగామ జిల్లా లింగాలగణపురం మండలం నేలపోగుల గ్రామంలో ఇటీవల హఠాన్మరణం చెందిన గొడిశల రవి గౌడ్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయంగా 100 కేజీల బియ్యాన్ని నేలపోగుల



ఎంపీటీసీ గుగ్గిల్ల నర్సయ్య సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆవుల ఎల్లమ్మ, వార్డు సభ్యులు గుగ్గిళ్ల యాకలక్ష్మి, అబ్బ సాయిలు, జిల్లా ఓబీసీ సెల్ సభ్యులు జోగు రాజు, సీనియర్ నాయకులు ఆకుల సత్తయ్య, మైల్ల ఉప్పలయ్య, బండి సోమయ్య, గొల్ల కొమురయ్య, గుగ్గిల్ల అబ్బసాయిలు, వడ్లకొండ సత్తయ్య, భాస్కర్, సతీష్, అబ్బులు, హరీష్, సోమయ్య, సత్తయ్య, సోమన్న, శ్రీను, గ్రామ పెద్దలు భిక్షం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలకు మానసిక ఉల్లాసం ఎంతో అవసరం

**ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మయూరి**

**ఎల్కతుర్తి ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** మండల కేంద్రంలోని కాకతీయ వన విహార్ ను భీమదేవరపల్లి ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మయూరి మాట్లాడుతూ.... తెలంగాణ ప్రభుత్వం అటవీ శాఖ



ఆధ్వర్యంలో ప్రతి ఏటా వనదర్శిని ప్రోగ్రాం ను చేపడుతున్నామని ఇందులో భాగంగా భీమదేవరపల్లి నుండి 100 మంది విద్యార్థినిలు వనవిహార్ను సందర్శించడం జరిగిందని వారికి బుక్స్, పెన్స్ పంపిణీ చేయడం జరిగిందని ఆమె అన్నారు. చిల్డ్రన్స్ పార్క్, ఫారెస్ట్ లో ఉన్న ప్రతి వృక్షమును, చెట్లను, ఓపెన్ జిమ్ విద్యార్థినిలకు చూపెట్టడం జరిగిందని తెలిపారు. విద్యార్థినిలకు ఇలాంటి కార్యక్రమాలు మనసుకు ఎంతో ఉల్లాసం మేదో శక్తిని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు నరేష్ విద్యార్థిని లు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కింగ్ ఫిషర్ విక్రయించడం లేదని ప్రజావాణిలో ఫిర్యాదు

**చేసిన మందు మద్దతుదారులు**

**జగిత్యాల ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రమైన జగిత్యాల పట్టణంలోని లిక్కర్ వ్యాపారులు కింగ్ ఫిషర్ బీర్లు విక్రయించడం లేదని ప్రజావాణిలో చేసిన ఫిర్యాదు చర్చనీయాంశంగా మారడంతో పాటు తీవ్ర చర్చకు దారి తీసింది. అన్ని



ముఖ్య పట్టణాలతో పాటు చివరికి బెల్ట్ షాపుల్లో కూడా లభ్యమవుతున్న కింగ్ ఫీషర్ బీరును జిల్లా కేంద్రంలో విక్రయించడం లేదని గతంలోనూ కూడా ఫిర్యాదులు చేసిన విషయం అందరికి తెలిసిందే. ఆ దరఖాస్తు సంబంధించి డిపార్ట్మెంట్ అధికారులు చేపట్టిన చర్యలు ఏమి లేకపోగా, చేసిన ఫిర్యాదు మాత్రం నెట్టింటా రకరకాలుగా వైరల్ అయ్యింది. ఈ క్రమంలోనే జగిత్యాల చెందిన బీరం రాజేష్ అనే వ్యక్తి కింగ్ ఫిషర్ బీర్ విక్రయించడం లేదని కలెక్టర్ కు దరఖాస్తు చేశారు. ఇదిలా ఉంటే కింగ్ ఫిషర్ బీరు విక్రయాలకు విపరీతమైన డిమాండ్, క్రేజీ ఉన్న అసలు లిక్కర్ వ్యాపారులు ఎందుకు కింగ్ ఫిషర్ బీర్ తెప్పించడం లేదో తెలియాల్సి ఉంది.

# ఆర్డబల్యూఎస్ ఎ.ఇ. వివేక్‌ను సస్పెండ్ చేయండి

- పాత పనులకు కొత్త రికార్డులు
- చేయని పనులకు దొంగ ఎంబి రికార్డులు
- చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు విజ్ఞప్తి
- తగు చర్యలు చేపట్టండి :
- మిషన్ భగీరథ ఈఈ ని ఆదేశించిన అదనపు కలెక్టర్ బిఎస్. లత

**బుగ్గారం ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామంలో చేయని పనులకు దొంగ ఎంబి రికార్డులు, బిల్లులు పొందిన పాత పనులకే కొత్త రికార్డులు తయారు చేసిన ఆర్ డబ్ల్యూ ఎస్ ఎ.ఇ. వివేక్ ను, ఇతర బాధ్యులందరినీ సస్పెండ్ చేస్తూ, పూర్తిగా పదవి నుండి తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ కు సోమవారం ప్రజావాణిలోతెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి పిర్యాదు చేశారు. జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామంలో చేయని పనులకు చేసినట్లుగా, బిల్లులు పొందిన పాత పనులకే మళ్లీ కొత్తగా తప్పుడు/దొంగ ఎంబి రికార్డులు తయారు చేశారని ఆయన పిర్యాదు లో వివరించారు. బుగ్గారం బస్టాండ్ ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర 2015-16 కాలంలో అప్పటి సర్పంచ్ సుద్దాల శరత్ చందర్ హయాంలో బోర్ వెల్ వేసి మోటర్ బిగించారు. అప్పుడే బిల్లుల చెల్లింపు కూడా జరిగింది. అదే బోర్ కు మళ్లీ కొత్తగా బోర్ వేసినట్లు తప్పుడు తీర్మాణాలతో ఆర్ డబ్ల్యూ ఎస్ ఎ.ఇ. వివేక్ దొంగ ఎంబి రికార్డులు తయారు చేశారని చుక్క గంగారెడ్డి ఆరోపించారు. కొత్త పాలకవర్గం ఈ దొంగ రికార్డులతో తేది: 20-12-2019న చెక్కు నం.5864 / 19005864 ద్వారా బుగ్గారం గ్రామపంచాయతీ నుండి రూ. 86,000 -00 లు కేంద్ర ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం చేశారని సూచించారు. మాజీ సర్పంచ్ సుద్దాల శరత్ చందర్ పాలనా కాలంలోనే అనగా దాదాపు 2015 -16 ప్రాంతంలో గ్రామప్రజల సౌకర్యార్థం అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిన ప్రొసీడింగ్ ద్వారా త్రాగునీటి కొరకు బావి త్రవ్విసిమెంట్ గాజులు వేశారు. కాస్త ఆలస్యంగా అప్పుడే బిల్లుల చెల్లింపు కూడా జరిగింది. కానీ.. అదే పనిని మేము కూడా చేశామని ప్రస్తుత పాలకవర్గం తప్పుడు తీర్మాణాలు చేసిందన్నారు. దీనికి ఆర్ డబ్ల్యూ ఎస్ ఎ.ఇ. వివేక్ సహకరించి దొంగ ఎంబి రికార్డులు తయారు చేశారని ఆరోపించారు. దీనివల్ల సుమారు రూ.3,00,000 లక్షల వరకు నిధులు బుగ్గారం గ్రామపంచాయతీ నుండి డ్రా చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని చుక్క గంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే బుగ్గారంలోని ఎదురు బోర్ల వద్ద కేవలం 9 గుంటల్లో నిర్మించిన ""పల్లె ప్రకృతి వనం"" ను తప్పుడు/దొంగ రికార్డులు తయారు చేసి 15 గుంటల్లో నిర్మించినట్లు బోర్డులు వ్రాశారన్నారు. దీనివలన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కు చెందిన రూ.2,51,354 -80 నిధులు అదనంగా దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ పనికి పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీర్ అధికారులు చేయాల్సిన ఎంబి రికార్డులను అవినీతికి పాల్పడి ఆర్ డబ్ల్యూఎస్ ఎ.ఇ. వివేక్ చేయడం పలు అనుమానాలకు దారి తీస్తుందన్నారు. ఇదే పల్లెప్రకృతి వనంలో బోర్ వెల్ వేసి ఉపాధి హామీ కూలీల ద్వారా చెట్లను పెంచుతున్నారు. కానీ నీళ్లను వాటర్ ట్యాంకర్ ద్వారా కొనుగోలు చేసి తీసుకొచ్చి చెట్లకు పోశామని తప్పుడు / దొంగ రికార్డులు సృష్టించారు. ఈ తప్పుడు / దొంగ రికార్డుల ద్వారా




క్రమసంఖ్య 21 టాస్క్ కోడ్: 41517 ద్వారా రూ.1,44,000 -00 అలాగే క్రమ సంఖ్య .06 టాస్క్ కోడ్ : 41518 ద్వారా మరొక్కసారి రూ.1,44,000-00 మొత్తం రూ.2,88,000-00 నిధుల దుర్వినియోగం చేశారని జిల్లా కలెక్టర్ కు ఇచ్చిన పిర్యాదు లో ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా బుగ్గారం మండలంలోని ఇతర గ్రామాలతో పాటు ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాలలో కూడా ఆర్ డబ్ల్యూ ఎస్ ఎ.ఇ. వివేక్ అవినీతికి పాల్పడి అనేక దొంగ బిల్లులు, దొంగ ఎంబి రికార్డులు తయారు చేసినట్లు తెలిసిందన్నారు. ఆయా గ్రామాలలో ఒక్కొక్క బోర్ వెల్ కు నాలుగైదు ఎంబి రికార్డులు తయారు చేసి వాటి ద్వారా 4 - 5 సార్లు బిల్లులు ఎత్తి కోట్లాది రూపాయల నిధుల దుర్వినియోగానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్పడ్డట్లు బాహాటంగా పలువురు ప్రజాప్రతినిధులు, బోర్ వెల్ వ్యాపారులు చెప్పుకుంటున్నారని ఆయన సూచించారు. మరోసారి ఎక్కడా కూడా ఇలాంటి దుర్వినియోగం, పరిస్థితులు పునరావృతం కాకుండా వెంటనే ఆర్ డబ్ల్యూ ఎస్.ఎ.ఇ. వివేక్ ను సస్పెండ్ చేసి, తగు న్యాయ విచారణ జరిపించి కోట్లాది రూపాయల నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన ప్రతి ఒక్కరినీ పదవుల నుండి పూర్తిగా తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని చుక్క గంగారెడ్డి సోమవారం జిల్లా కలెక్టర్ ను కోరారు. ఫిర్యాదును పరిశీలించిన అదనపు కలెక్టర్ బిఎస్. లత తగు చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను ఆదేశించారు.

# ప్రీతి మరణానికి కారణమైన సైఫ్‌ను వెంటనే ఉరి తీయాలి

**నర్మెట్ట ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** మండల కేంద్రంలో ధరావత్ ప్రీతి మృతిని తీవ్రంగా ఖండిస్తూ మండలంలోని వివిధ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అన్ని పాఠశాలలను కళాశాలలను బందు చేసి అనంతరం చౌరస్తాలో ధర్నా నిర్వహించి ప్రీతి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించి అనంతరం ధరావత్ రాజు నాయక్ మాట్లాడుతూ కేఎంసీ పీజి వైద్య విద్యార్థి ధరావత్ ప్రీతి మృతి తో యావత్ రాష్ట్రమంతా దిగ్భ్రాంతికి లోనైంది అన్నారు. ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడి ఓడిపోవడం ప్రీతి కుటుంబ సభ్యులతోపాటు... రాష్ట్ర ప్రజలందరినీ కలిచివేసింది. డా. ప్రీతి మరణం అత్యంత బాధాకరమని.. ఎంతో భవిష్యత్ ఉన్న ప్రీతి చనిపోవడం తమ మనసులను తీవ్రంగా కలిచివేస్తుందన్నారు. ప్రీతి ది ఇది ముమ్మాటికీ హత్యే అని ఫిర్యాదు చేయగానే ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఈ దారుణం జరిగిందని అన్నారు. ప్రీతి ఆత్మహత్య ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రీతి ఘటనపై ఇప్పటివరకు సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించలేదు? అని ప్రశ్నించారు. కేసిఆర్ ప్రభుత్వ అధికారిక నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి గోరాలు జరుగుతున్నాయి అని అన్నారు. 'వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి' మృతి కి కారణమైన 'సైఫ్' ను వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కేఎంసీ కళాశాల ప్రిన్సిపల్ ని సస్పెండ్ చేసి వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని అన్నారు. ధరావత్ ప్రీతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేసి వెంటనే వారికి 50 లక్షల రూపాయలను మరియు వారి ఇంటిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించి వెంటనే నియామక పత్రాన్ని



అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొర్ర సాయినాథ్, బానోత్ సుమన్, బాణోత్ సురేష్,బాణోత్ అశోక్, విద్యార్థులు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 45వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమం

- ప్రారంభించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**జగిత్యాల ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ 45 వ వార్డు వైశ్య భవన్ లో కంటి వెలుగు కార్యక్రమాన్ని వార్డులో ప్రారంభించి కేంద్రాన్ని పరిశీలించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ప్రపంచ జనాభాలో అత్యధిక జనాభా నివారించదగిన అంధత్వం గల వారు భారత దేశంలోనే సగం మంది ఉన్నారు అని అన్నారు. 1 కోటి 30 లక్షల మందికి పైగా ప్రజలకు చికిత్స ల నిమిత్తం కంటి వెలుగు ఏర్పాటు చేయటం జరిగింది. 100 వారాల పాటు కంటి వెలుగు కార్యక్రమం జరుగుతుంది. జగిత్యాల పట్టణంలో 9 టీమ్ లు ఒక్కొక్క టీమ్ రోజుకు 200 మందిని చూస్తారు. ప్రపంచంలో మరియు దేశంలో ఎక్కడా ఇంత పెద్ద కార్యక్రమం అమలు చేయలేదు. బస్తి, పల్లె దవాఖాన ల ఏర్పాటు ద్వారా ప్రజల వద్దకే మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. మెడికల్ కాలేజీ లు ఏర్పాటు ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షులు గట్టు సతీష్, స్థానిక కౌన్సిలర్ బోడ్ల జగదీష్, వైశ్య సంఘం అధ్యక్షులు మంచాల కృష్ణ, కమిషనర్ డా. నరేష్, ఏఒ శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస్, కౌన్సిలర్ కప్పల శ్రీకాంత్, చాంద్ పాషా, జిల్లా రైతు బంధు సమితి సభ్యులు దామోదర్ రావు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు,యూత్ అధ్యక్షులు గిరి, నాయకులు సమిండ్ల శ్రీనివాస్, దాసరి ప్రవీణ్, అడువాల లక్ష్మన్, సుభాష్, రామ్మోహన్ రావు, లవంగ రాజేందర్, కొలగాని సత్యం, సింగరావు, దూమాల రాజ్ కుమార్, మేక పవన్, బట్టు ప్రవీణ్,





వంశీ బాబు, వేణు మాధవ్, భోగ అరవింద్, పెండెం గంగాధర్, అజీమ్, రవి, రహమాన్, మహేష్, వైద్య అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా ప్యాడ్, పెన్నుల వితరణ

**రాయికల్ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** రాయికల్ మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం ఆంధ్ర ప్రభ పాత్రికేయుడు వాసం లింబాద్రి పరీక్షా ప్యాడ్ లు, పెన్నులను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సామల్ల లావాణ్య,జిల్లా స్కిల్ కమిటీ సభ్యులు నాగిరెడ్డి రఘుపతి, ప్రాధానోపాధ్యాయుడు ఎం. శేఖర్, ఉపాధ్యాయులు మహేశ్వర శర్మ, మధు, సంపత్ కుమార్, శాంత కుమారి, పాల్గొన్నారు.



# ఎల్ఒసి అందజేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**జగిత్యాల ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** జగిత్యాల అర్బన్ మండల ధరూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ బాలే లక్ష్మణ్ అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతూ ఉండగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే



డాక్టర్ సంజయ్ కుమార్ స్పందించి నిమ్స్ లో శస్త్ర చికిత్స నిమిత్తం 2 లక్షల 75 వేల ఎల్ఓసి ని బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా చికిత్స నిమిత్తం ఎల్ఓసి మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే కు లక్ష్మణ్ వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి వెంట పిఎసిఎస్ వైస్ చైర్మన్ సురేందర్, అర్బన్ మండల పార్టీ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, కొలుగూరి సత్యనారాయణరావు, శేఖర్ రావు, శ్రీనివాస్, తిరుపతి, నరసయ్య, రాజం, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం

**బిజెపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల కిరణ్**

**ఎల్కతుర్తి ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** బిజెపి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో మెడికల్ విద్యార్థి ప్రీతి మరణానికి న్యాయం జరగాలని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ఇంతటి దారుణానికి ఒడిగట్టిన మెడికో సైకో విద్యార్థి సైఫ్ కి ఉరిశిక్ష విధించాలని ఎంజీఎం



కూడలిలో ధర్నా నిర్వహిస్తుండగా అక్రమంగా పోలీసులు అరెస్టు చేసి వారిని ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ కి తరలించడం జరిగింది. వీరిని పోలీస్ స్టేషన్ కి తరలించే క్రమంలో డీసీఎం వ్యాన్ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడపడం వల్ల బిజెపి వరంగల్ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సుజాత గారు కిందపడి గాయపడటం జరిగింది. కనీసం మహిళలను అక్రమంగా అరెస్టు చేసినప్పుడు ఒక మహిళ కానిస్టేబుల్ కూడా వారిని తరలించే క్రమంలో లేకపోవడం సిగ్గుచేటు అని పోలీసులు ఇలా అక్రమంగా అరెస్టు చేసి వారిని తరలించే క్రమంలో ఉదాసీనంగా వ్యవహరించడాన్ని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల కిరణ్ ఖండించడం జరిగింది.

## ర్యాగింగ్ భూతాన్ని అరికట్టాలి

**ఏబీవీపీ**

**జగిత్యాల ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థి ప్రీతికి న్యాయం చేయాలని, సైకో సైఫ్ ను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాల బంద్ కు ఏబీవీపీ పిలుపు నివ్వడంలో భాగంగా



సోమవారం జగిత్యాలలో మెడికల్ కళాశాలను బంద్ నిర్వహించిన ఏబీవీపీ నాయకులు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ రాపాక సాయికుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని ర్యాగింగ్ భూతం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని ఆయన ఆరోపించారు. ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని అదేవిధంగా సైకో సైఫ్ ను కఠినంగా శిక్షించి పది సంవత్సరాలపాటు చదువుల నుండి బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ర్యాగింగ్ భూతాన్ని అరికట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విస్తారక్ నల్ల నవీన్ కుమార్, నగర కార్యదర్శి మనవాడ నందు, జోనల్ ఇన్చార్జి గుగ్గిల అంజి, వినయ్, సాయికిరణ్, నిఖిల్ రఘు, రాజు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీతి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

**- సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా**

**జనగామ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ర్యాగింగ్ ను ప్రభుత్వం నియంత్రించ లేక పోతుందని, ర్యాగింగ్ తో మృతి చెందిన ప్రీతి మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన అన్నారు. ప్రీతి మృతికి కారణమైన సైఫ్ ను కఠినంగా శిక్షించాలని, కాకతీయ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, హెచ్డిఓలను సస్పెండ్ చేయాలని, ప్రతి కుటుంబాన్ని అన్ని విధాల ప్రభుత్వమే ఆదుకోవాలని, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా కటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.



# అవినీతిపై కేంద్రం రాజీ యుద్ధం!

దేశ ప్రజల సమస్యలపై అధికారంలో ఉన్న బిజెపి చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు. అవినీతిపై యుద్ధం అంటూ వందకోట్ల లిక్కర్ స్కామ్‌లో ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను అరెస్ట్ చేశారు. ఈ విషయంలో అవినీతి జరిగివుంటే తప్పకుండా చర్యలు తీసుకోవాల్సిందే. ఇదే సందర్భంలో అవినీతికి సంబంధించి ఎంతటి వారైనా ఉపేక్షించరాదు. వేలకోట్లు మింగిన అనేకమంది నేతలు, పారిశ్రామిక వేత్తలు, బ్యాంకు రుణాల ఎగవేతదారుల విషయంలో ఇదే వైఖరిని అవలంబించి ఉంటే బాగుండేది. విచారణలో స్వపక్షం, వ్యతిరేక పక్షం అన్న రీతిలో వ్యవహరించడం నయవంచన తప్ప మరోటి కాదు. లిక్కర్ కేసే కాదు..అవినీతి కేసులన్నింటినీ విచారించాల్సిందే. ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న వారు ఎంతటి వారైనా బోనులో నిలబెట్టాల్సిందే. బ్యాంకులకు రుణాలు ఎగగవేసి దర్జాగా తిరుగుతున్న వారు ఎందరో ఇంకా దేశంలోనే ఉన్నారు. వారి చిట్టా తీయాల్సిందే. ఇకపోతే బిజెపికి అధికారం మీద ఉన్న యావ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కానరావడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికారం తమదే అంటూ రంకెలు వేస్తున్నారు. నిజానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో బిజెపి ఒరగబెట్టిందేమీ లేదు. అలాగే నిధులకు సంబంధించి రాజ్యాంగానికి అనుగుణంగా నెరవేర్చాల్సిన బాధ్యతను కూడా చేయడం లేదు. విభజన సమస్యలను వదిలేశారు. మరి ఏం చేశారని బిజెపి అధికారం కోరుకుంటుందో చెప్పాలి. కేవలం కెసిఆర్ అవినీతి, జగన్ అక్రమాలు అంటూ చేసే విమర్శలతో ప్రజలకు సంబంధం ఏమిటో చెప్పాలి. డబుల్ ఇంజిన్ అంటూ ఊదరగొడుతున్న వారు బిజెపి పాలిత రాష్ట్రాల్లో పాలనపై చెప్పగలుగుతారా అన్నది ఆలోచన చేయాలి. అందుకే బిజెపి నేతల తీరు ప్రజలకు స్వాంతన కలిగించేలా లేదు. ఒకవేళ కెసిఆర్ లేదా జగన్ అవినీతికి పాల్పడితే విచారణ చేయించకుండా ఎందుకు పిట్ట బెదరింపులు చేస్తున్నారో అర్థం కావడం లేదు. ప్రగతిభవన్‌లోకి వస్తాం.. ఫాంహౌస్‌లోకి వస్తాం.. మీ సంగతి చూస్తాం.. అంటూ సీఎం కేసీఆర్‌ను,జగన్‌ను బెదరించడం ద్వారా తాత్కాలికంగా ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం సరికాదు. నిజంగానే వీరు అవినీతికి పాల్పడివుంటే ఆధారాలతో బయటపెట్టాలి. ప్రజలముందు నిలదీయాలి. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను ఎత్తిచూపితే తప్పు లేదు. కానీ వాటికి పరిష్కారం చూపాలి. కేంద్రం ఏం చేస్తున్నదో చెప్పాలి. బిజెపి అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో చెప్పలేకపోతున్నారు. ప్రాంతీయ పార్టీల పాలనను ప్రశ్నిస్తున్న వారు తాము ఏం చేస్తారో చెప్పలేక పోవడం రాజకీయ వైఫల్యం తప్ప మరోటి కాదు. నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇచ్చారా? దళితులకు మూడు ఎకరాల భూమి పంపిణీ చేశారా? నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చారా? రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అందించారా? అంటూ చేస్తున్న సవాళ్లతో రాష్ట్ర ప్రజలకు ఏదైనా న్యాయం జరుగుతుందా అన్నది ఆలోచించడం లేదు. అయితే సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో తప్పు లేదు. సమస్యలపై ప్రజల పక్షాలన ఎవరైనా కొట్లాడా ల్సిందే. ప్రభుత్వాల తప్పులను నిలదీయాల్సిందే. ఎపిలో విశాఖ



స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కేంద్రాన్ని నిలదీస్తున్నారు. విభజన సమస్యలపైనా నిలదీస్తున్నారు. వివిధ హామీలు, ఉద్యోగాలు, నీటి పంపకాల పైనా కేంద్రాన్ని అన్ని పార్టీలు విమర్శిస్తున్నాయి.

ఇది ప్రజాస్వామ్యంలో అవసరమే. అయితే రాష్ట్రం లోని బిజెపి రాష్ట్ర సమస్యలపై కేంద్రం ఇచ్చిన హామీల గురించి కేంద్రాన్ని కూడా ప్రశ్నిస్తే మంచిది. వీటిని ఎందుకు ప్రశ్నించడం లేదు. అంతెందుకు విభజన సమస్యల్లో ఏవైనా ఎందుకు పరిష్కరించరని కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదో అన్నది ఆలోచించాలి. నిజానికి బిజెపి నేతలు ఎవ్వరూ ప్రజల సమస్యలను ప్రస్తావించే ప్రయత్నం చేయడంలేదు. ప్రజలు ఎదుర్కొంటున్న ధరలు, జిఎస్టీ మొదలు, గ్యాస్ భారం, నిత్యావసర ధరలపై ఒక్కమాటా మాట్లాడం లేదు. వీటిని ప్రధాని మోడీతో చర్చించే సాహసం చేయడం లేదు.

ఓ జాతీయ పార్టీ అవలంబించాల్సిన రీతి వారిలో ఎక్కడా కానరావడంలేదు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తారో చెప్పడం లేదు. ప్రజల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకుని వెళతామన్న లక్ష్యాన్ని ప్రకటించడం లేదు. ఈ క్రమంలో బిజెపితో పోలిస్తే టిఆర్ఎస్ నయం అనిపిస్తోంది. కెసిఆర్ పాలన ఎంతోకొంత రాష్ట్రానికి మేలు జరుగుతోంది. మోడీ అంతా మంచే చేస్తున్నారని స్వామి భక్తి ప్రకటించాల్సిన అసవరం లేదు. మోడీని కీర్తిస్తూ.. కెసిఆర్‌ను తిడుతూ..ఎన్ని పాదయాత్రలు చేసినా..ఎంతగా వగచినా ప్రజలు బిజెపిని నమ్మరని బండి సంజయ్ గుర్తించాలి. నిజానికి తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అవకాశాలను బిజెపి చేజేతులా జార్చుకుంటోంది. ఎపిలో కూడా ఎలాంటి సమస్యలను తీర్చలేదు సరికదా..ఉన్న విశాఖ ఉక్కును తుక్కు కింద అమ్మేస్తున్నారు. ఇక కడప ఉక్కు రావడం కల్ల కాకమరోటి కాదు. బయ్యారం ఉక్కు, ఖాజీపేట రైల్వే కోచ్, గిరిజన యూనివర్సి టీలపై బిజెపి నేతలు ఎందుకు మాట్లాడరు. ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదు. ఎదురుదాడితో సమస్యలను పక్కదారి పట్టించే పార్టీగా బిజెపి నిలుస్తోంది. ఇరు తెలుగు రాష్ట్రాల్లో దూకుడు పెంచిన బిజెపి నేతలు అధికారమే లక్ష్యంగా చేస్తున్న రాజకీయ విన్యాసాలు ఏవగింపు కలిగిస్తున్నాయి. కెసిఆర్ కుటుంబ పాలన అంటూ విమర్శలకు దిగుతోంది. దక్షిణ భారతంలో 'కాంగ్రెస్ ముక్త్' భారత్ బిజెపి వల్లే సాధ్యమని, తెలుగు రాష్ట్రాల్లో తెరాస,వైసిపిలతో ఏదీ కాదని బిజెపి నేతలు తరచూ విమర్శిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రలో ప్రజలకనుగుణంగా పాలన నడిపించే శక్తి భాజపాకు, మోదీకి మాత్రమే ఉందంటున్నారు. వారసత్వ రాజకీయాలు, ప్రభుత్వ వైఫల్యాలపై సమర శంఖం పూరిస్తూ తదుపరి అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావాలని ఇస్తున్న పిలుపుతో ప్రజల్లో కదలిక రావాలి. కానీ ప్రజల్లో పెద్దగా స్పందన కానరావడం లేదు. అధికారం కావాలంటే ప్రజలకు మంచి పనులు చేయాలి. దేశంలో ఒక్క మంచి పని చేయని బిజెపిని ప్రజలు ఎదంకు ఆదరించాలో ఆలోచించాలి. మొత్తంగా ఎలాంటి ప్రణాళిక ఉందో తెలియదు కానీ తెలంగాణలో, ఎపిలో పాగా వేస్తామని ప్రకటనలు మాత్రం గుప్పిస్తున్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో బిజెపి చేస్తున్న విన్యాసాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. కేవలం విమర్శలతో అధికారం దక్కించుకోలేమని బిజెపి నేతలు గుర్తిస్తే మంచిది.

## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం






"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

-ఎడిటర్

## సోమరి రోగం

నక్కకు బాగా ఆకలిగా ఉంది. ఆహారం కోసం మండుటెండలో అడవంతా తిరిగింది. కానీ చిన్న జంతువు కూడా దొరకలేదు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి. ఆకలికి తట్టకోలేక మడుగులో నీళ్ళు తాగి కడుపు





నింపు కుంటోంది. ఇప్పుడు కూడా అదేపని చేసింది. కాళ్ళీడ్చుకుంటూ చెట్టు నీడకు చేరింది. నిలబడే ఓపిక లేక కింద కూలబడింది.

చెట్టు కొమ్మల మీద గంతులేస్తున్న ఉడుత ఉలిక్కిపడి కిందకు చూసింది. కిందికొచ్చి నక్క నాడిని పరిశీలించింది. సొమ్మసిల్లిందని గమనించింది. ప్రక్కనే ఉన్న మడుగులో మునిగి వచ్చింది. తన కుచ్చుతోకను విదిలించి నక్క ముఖంపై నీటిని చిలకరించింది. అది తేరుకునే లోపు తాను దాచుకున్న ధాన్యం గింజలు తెచ్చింది. నక్క నెమ్మదిగా కళ్ళు తెరిచి ఏదో చెప్పబోయింది " మీరు బాగా నీరసంగా ఉన్నారు. ముందు ఈ నాలుగు గింజలతో ఎంగిలిపడండి" అంది.

గింజల్ని తిని "ఆహా ఎంత రుచిగా ఉన్నాయి. ఇవి నిజంగా ఎంతో బలమైన ఆహారం. ఈ ఉడుతను మాయమాటలతో బురిడీ కొట్టించి, ఇక్కడే ఉండిపోవాలి. ప్రతిరోజూ ఆహారం వెతుక్కునే బాధ నుండి బయట పడాలి" అనుకుంది నక్క.

"ఇప్పుడు చెప్పండి ఇంత నీరసంగా ఉండి ఒంటరిగా ఎటువెళు _న్నారు?"అడిగింది ఉడుత.

"నా బాధ పగవాడికి కూడా రాకూడదు ఒళ్ళంతా ఒకటే నొప్పి అడుగు తీసి అడుగు వేయలేనంత నీరసంగా ఉంటోంది. ఈ రోగానికి వారం రోజులు కదలకుండా వైద్యం చేయించు కోవాలి. ఏదో నాకు తెలిసిన వైద్యం చేసుకుంటూ మూలికల కోసం ఇంతదూరం వచ్చాను. మూలికలైతే ఆకలి తీర్చలేవు కదా ! " అంటూ కన్నీరు కార్చింది నక్క.

ఉడుతకు జాలి వేసింది." మీ బాధ నాకు అర్థమైంది. ఈ వారం రోజులు ఇక్కడే ఉండి, దొరికిన మూలికలతో వైద్యం చేసుకోండి. మీకు కావాల్సిన ఆహారం నేను తెచ్చిపెడతాను" అని నక్కతో అంది. తన పథకం పారినందుకు నక్క లోలోన సంతోషించింది.

నెల రోజులు గడిచినా నక్క బాధ తీరలేదు. లేని బాధను నటిస్తూ మూలగసాగింది. దానికి సరిపోయినంత ఆహారం తెచ్చిపెట్టడం ఉడుతకు శక్తికి మించిన పనైంది. అయినా ఇచ్చిన మాటకు కట్టుబడి కష్ట పడసాగింది.

ఒక రోజు గింజల్ని ఏరుకొని తిరిగొస్తుంటే తోటి నక్కలతో ఉల్లాసంగా ఊలపెడుతున్న నక్క కనిపించింది. ఉడుత దాన్ని చూచి అవాక్కైంది. నెల రోజులుగా రోగం పేరుతో మోసం చేసిందని గ్రహించింది. దానికి తగిన గుణపాఠం చెప్పాలని నిర్ణయించుకొని ఇంటికి చేరింది.

అప్పుడే ఆహారాన్ని వెతుక్కుంటూ జిరాఫీ అటువైపు వచ్చింది. మిత్రుడైన ఉడుత యోగక్షేమాలు కనుక్కుంది. మాటల మధ్యలో నక్క గురించి చెప్పింది ఉడుత. నక్క పీడ వదిలించుకునే ఉపాయం చెప్పుమని కోరింది. జిరాఫీ దాని చెవిలో ఓ రహస్యం చెప్పి వెళ్ళి పోయింది. అది అటు వెళ్ళగానే, నక్క మూలుగుతూ అక్కడికొచ్చింది. ' జిరాఫీ నీకెలా తెలుసు?" అడిగింది నక్క.

"ఈ జిరాఫీ నా స్నేహితురాలు. తనకు వైద్యం బాగా తెలుసు. ఇప్పటి దాకా నీరోగం గురించే మాట్లాడుకున్నాం. రోగ లక్షణాలను బట్టి ఇది 'సోమరి రోగమని' జిరాఫీ చెప్పింది. ఈ రోగానికి తొక్కుడు మందు" ఒక్కటే సరైన వైద్యమట!" చెప్పింది ఉడుత. "తొ..తొ.. తొక్కుడు మందా?! అంటే " కంగారుగా అడిగింది నక్క.

"నా మిత్రుడు జరాఫీ దగ్గర నాలుగు బలమైన వేట కుక్కలు శిష్యరికం చేస్తున్నాయి. అవి నీ కాళ్ళను కదలకుండా అదిమి పట్టుకుంటాయి. జిరాఫీ తన ముందు కాళ్ళతో పైకి లేచి, నీ శరీరంలో నొప్పి ఉన్నచోట బలంగా తొక్కుతుంది. దెబ్బకు నీ రోగం తా ! దీన్నే ' తొక్కుడు మందు' అంటారు". చెప్పింది ఉడుత.

ఉడుత మాటల్ని బట్టి తన నాటకం బయటపడిందని గ్రహించింది నక్క. "నా రోగం తగ్గిపోయింది. ఇక వైద్యంతోపనిలేదు." అంటూ జారుకోబోయింది.

నక్క మామ! సోమరి రోగం" తొక్కుడు మందుతో సరి! నమ్మిన వారిని ఎంతో కాలం మోసం చేయలేవని గుర్తుంచుకో. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని సోమరి తనాన్ని వదిలి పెట్టు. కష్టపడి పనిచేయడం నేర్చుకో" హితవు పలికింది ఉడుత. చేసిన తప్పుకు సిగ్గుపడి, క్షమాపణ చెప్పింది నక్క. అప్పటి నుండి దానికి మళ్ళీ ' సోమరి రోగం' రాలేదు.

– డా.పోతగాని సత్యనారాయణ,

ఖమ్మం, 9441083763

## పలు ప్రత్యేకతల సమాహారం మొరార్జీ దేశాయ్ జీవితం

### ఏటా జన్మ తేదీ లేని దివంగత ప్రధాని



పాశ్చాత్య సాంప్రదాయం ప్రకారం పుట్టిన తేదీన జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ప్రతి ఏడూ అలా పాశ్చాత్య సంస్కృతి ప్రభావాన పుట్టిన తేదీన భారత దేశంలోనూ జన్మదినం సందర్భంగా వేడుకలు జరుపుకోవడం సర్వసాధారణం. అయితే భారత దేశ చరిత్రలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి, వివిధ పదవులను అలంకరించి, దాదాపు శత సంవత్సరాలు జీవించిన ఒక గొప్ప నాయకునికి అలాంటి అవకాశం లేకుండా పోయింది. అందుకే ఆ దివంగత గొప్ప నాయకుని జన్మదినం చాలా మందికి గుర్తుండదు. ఆయనే దివంగత భారత ప్రధాని మొరార్జీ దేశాయ్. కారణం ఆయన ఫిబ్రవరి 29వ తేదీన జన్మించడమే. లీపు సంవత్సరము అయితే తప్ప ఆయనది ప్రాతి సంవత్సర జన్మదినం కాకపోవడమే. నాలుగు ఏళ్లకు ఒకసారి మాత్రమే ఫిబ్రవరి 29 రావడం కావడమే. జన్మదిన ప్రత్యేకత లాగే పలు విధ ప్రత్యేకతల సమాహారం మొరార్జీ జీవితం. మొరార్జీ దేశాయ్ పండిన 99 ఏళ్ళ వయసు వరకు జీవించినా, ఫిబ్రవరి 29 న జన్మించి నందున అయన తన జీవిత కాలంలో కేవలం 24 పుట్టిన రోజులను మాత్రమే చూసి, 25వది రావడానికి కొద్ది రోజుల ముందు కన్ను మూశారు.

పార్లమెంటులో ఎనిమిది వార్షిక మరియు రెండు మధ్యంతర బడ్జెట్లను ప్రదర్శిస్తూ మొరార్జీ దేశాయ్ ఒక ప్రత్యేకమైన రికార్డును కలిగి ఉన్నారు. 1964 మరియు 1968 లో ఫిబ్రవరి 29 న రెండు కేంద్ర బడ్జెట్లను సమర్పించిన ఆర్థిక మంత్రిగా ఆయనకు ప్రత్యేకమైన ప్రత్యేకత ఉంది, ఇది అయన పుట్టినరోజు కావడం గమనార్హం.

దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచిన నేతగా చరిత్రలో మిగిలి పోయారు. అత్యధిక పౌర పురస్కారాలను అందుకున్న ఏకైక భారతీయుడిగా ఆయన గుర్తింపు పొందారు.

పాకిస్తాన్ సంబంధిత అత్యున్నత పౌర పురస్కారం... నిషానే – ఎ – పాకిస్తాన్ – 1986 లో గెలుచుకున్న ఏకైక భారతీయుడు. 1991లో భారత రత్న పురస్కారం పొందారు. అలా భారత దేశం, పాకిస్తాన్ దేశాల అత్యున్నత పౌర పురస్కారాలైన భారత రత్న, నిషానే పాకిస్తాన్ లను పొందిన ఏకైక భారతీయుడు మొరార్జీ. మొరార్జీ దేశాయ్ బొంబాయి రాజ్యంలో (ప్రస్తుతం గుజరాత్) బ్లస్టర్ జిల్లాకు చెందిన భదేలీ గ్రామంలో 1896 ఫిబ్రవరి 29 న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ముంబైలోని విల్సన్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ చేసిన తరువాత ఆయన గుజరాత్ లో సివిల్ సర్వీసులో చేరారు. 1927-28 గోద్రాలో జరిగిన అల్లర్ల సమయంలో హిందువులపై మెతక వైఖరి అవలంభించాననే అపరాధ భావంతో మే1930న అతను గోద్రా డిప్యూటీ కలెక్టరు ఉద్యోగానికి రాజీనామా చేసారు.

మహాత్మాగాంధీ అధ్వర్యంలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో చేరారు. భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో అనేక సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించారు. తన తెలివైన నాయకత్వ నైపుణ్యాల వల్ల స్వాతంత్ర్య సమర యోధులందరికీ అభిమాని అయ్యారు. గుజరాత్ ప్రాంతంలో భారత జాతీయ కాంగ్రెస్‌కు ముఖ్యమైన నాయకుడయ్యారు .1934, 1937 లలో ప్రాంతీయ ఎన్నికలు జరిగినప్పుడు, అతను బొంబాయి ప్రెసిడెన్సీలో వరుసగా రెవెన్యూమంత్రి, హోంమంత్రి బాధ్యతలను చేపట్టారు. 1952లో బొంబాయి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నుకో బడ్డారు. బొంబాయి రాష్ట్రం ద్వి భాషా రాష్ట్రంగా ఉండేది. బొంబాయి రాష్ట్రంలో గుజరాత్, మరాఠీ భాషలు మాట్లాడే ప్రజలు ఉండేవారు.

ధృఢమైన గంధేయవాదిగా దేశాయ్, ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ సోషలిస్టు విధానాలకు వ్యతిరేకంగా సామాజిక సంప్రదాయ వాదిగా, అనుకూల – వ్యాపార, ఉచిత సంస్థ సంస్కరణలకు అనుకూలంగా ఉన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఎదిగిన దేశాయ్, అవినీతి వ్యతిరేక అంశాలతో తీవ్ర జాతీయ వాదిగా, ప్రధానమంత్రి నెహ్రూ, అయన మిత్రపక్షాలను విభేదించారు. దేశాయ్ ఇందిరా గాంధీ ప్రభుత్వంలో ఉప ప్రధాన మంత్రిగా సేవల నందించారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రభుత్వంలో అనేక కీలక పదవులను చేపట్టారు. బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రి, భారత హోం మంత్రి, ఆర్థిక మంత్రి, ప్రతిపక్ష నేత పదవులతొ పాటు భారతదేశ 2వ ఉపప్రధాని పదవిని కూడా చేపట్టారు.

1977 మార్చి 24వ తేది మొరార్జీ దేశాయి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1979 జూలై 26 వరకు భారత దేశానికి 4వ ప్రధానిగా తన సేవల నందించారు. భారత రాజకీయ చరిత్రలో 81 సంవత్సరాల వయసులో ప్రధాని పదవిలో ఉన్న నేత. అలాగే కాంగ్రెసేతర ప్రధానిగా పదవి చేపట్టి, 1979 లో ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. రెండున్నర సంవత్సరాలు (మార్చి 1977 నుండి జూలై 1979 వరకు) మాత్రమే ప్రధానిగా ఉన్నారు. వివాదం లేకుండా ప్రజా జీవితంలో నాలుగు దశాబ్దాలు గడిపిన గొప్ప నాయకుడు. ప్రధాని పదవికి రాజీనామా చేసిన తరువాత, ఆయన ఎప్పుడూ చురుకైన రాజకీయాల వైపు తిరిగి చూడలేదు.

మొరార్జీ దేశాయ్ జనతాపార్టీకి 1980 సార్వత్రిక ఎన్నికలలో సీనియర్ రాజకీయ నాయకుడిగా ప్రచారం చేశారు, కాని ఎన్నికలో పోటీ చేయలేదు. అయన "యూరిన్ థెరపీ"ని అభ్యసించే వారు. 1978లో "మూత్ర చికిత్స" దీర్ఘకాలిక అభ్యాసకుడైన దేశాయ్ డేంరాథర్ తో "60 మినిట్స్" కార్యక్రమంలో మాట్లాడుతూ మూత్రం త్రాగడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య చికిత్స పొందలేని లక్షల మంది భారతీయులకు మూత్ర చికిత్స అనేది పరిపూర్ణ వైద్య పరిష్కారం అని దేశాయ్ వివరించారు. స్వ మూత్రం తాగడం ద్వారా తన దీర్ఘాయువుని కాగలిగానని చెప్పారు. దీనిని "జీవజలము" అని పిలిచారు.

మొరార్జీ దేశాయ్ దృష్టిలో నిజాయితీ అనేది ఒక విశ్వాసం తప్ప అవసరం కాదు. ఎట్టి పరిస్థితుల్లో అయినా ఆయన తాను నమ్మిన సిద్ధాంతాలకే కట్టుబడి ఉండేవారు. క్లిష్టమైన సందర్భాల్లో కూడా ఆయన రాజీపడిన దాఖలాలు లేవు. 'జీవితంలో ప్రతి ఒక్కరూ నిజాయితీకి కట్టుబడి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలన్న ధర్మ సూత్రాన్ని' మొరార్జీ దేశాయ్ ఆచరించి చూపించారు.

దేశాయ్ 1896 లో జన్మించారు. పదవీ విరమణ తరువాత అయన ముంబైలో నివసించి సంతోషంగా గడిపి, 1995 లో 99 సంవత్సరాల వయసులో మరణించారు. దేశాయ్ తన 100 వ పుట్టిన రోజుకు కొద్ది నెలల వ్యవధిలో 1995 ఏప్రిల్ 10 న కన్ను మూశారు. అత్యధిక కాలం జీవించిన దివంగత భారత ప్రధానిగా పేరు గడించారు.



-ఆర్కె సంగనభట్ల

9440595494

## అదానీ.. ఓ గుణపాఠం

ఆర్థికాభివృద్ధిలో కార్పొరేట్ దిగ్గజాల మధ్య పెరుగు తున్న పోటీ అనారోగ్యకర ధోరణులకు దారి తీయకూడ దని ప్రముఖ ఆర్థిక వేత్త స్వామినాథన్ అయ్యర్ సూచిం చారు. గౌతమ్ అదానీ వ్యవహారంపై అమెరికాకి చెందిన పరిశోధనా సంస్థ హిండెన్‌బర్గ్ సమర్పించిన నివేదిక వాస్తవానికి అదానీకి మేలు చేస్తుందని అన్నారు. నిదానమే ప్రధానమని మన పెద్దలు చెప్పిన సూక్తి ఇలాంటి సంద ర్భాల్లో వర్తిస్తుంది. అదానీ అతి




స్వల్ప కాలంలో ప్రపంచ మహాకోటీశ్వరుల జాబితాలో మొదటి స్థానాన్ని సంపా దించేందుకు తొక్కిన అడ్డదారుల వల్లనే ఈరోజు పతన మయ్యారు.ఆయన ఎంత వేగంగా ఆ స్థానానికి దూసు కుని వెళ్ళారో అంత వేగంగానూ చతికిల పడ్డారు. ఇందు కు ఆయన ప్రదర్శించిన అత్యుత్సాహానికి తోడు ప్రభుత్వ వర్గాల నుంచి సరైన నియంత్రణ లేకపోవడం ప్రధాన కారణం. మేక్ ఇన్ ఇండియా నినాదాన్ని సాకారం చేయ డం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇస్తున్న ప్రాధా న్యతను ఉపయోగించుకుని అదానీ తన పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, పెట్టుబడులను అనూహ్యంగా పెంచు కోవడానికి తొందరపడ్డారు. ఆ తొందరలో నిబంధనల ను తుంగలోకి తొక్కారు.

మన దేశంలో ఇలాంటి అక్రమాలకు పాల్పడ్డవారంతా రాజకీయ పలుకు బడి నుపయోగించి బయటపడుతున్నట్టే తానూ బయట పడొచ్చను కున్నారు. కానీ, అమెరికన్ సంస్థల్లో తన పప్పులుడకలేదని తెలుసుకోవ డానికి ఆయనకు ఎంతో కాలం పట్టలేదు. ఆయనను నియంత్రించేందుకు దేశం లో ప్రభుత్వ సంస్థలు సకాలంలో సరైన చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నదే స్వామినాథన్ అయ్యర్ వ్యాఖ్యల సారాంశం. ఇప్పటికైనా అదానీ తన పరిస్థితిని సరిదిద్దుకోవడానికి అవకాశం ఉందని ఆయన అంటున్నారు. విమానాశ్రయాలు, రేవులు, విద్యుత్ ప్రాజెక్టులు, జాతీయప్రధాన రహదారులు%ॅ% ఒకటేమి టి? అన్నిప్రధాన ప్రాజెక్టుల కాంట్రాక్టులను అదానీ సంపాదించారు. ఎక్కడికో ఎందుకు మన ఆంధ్ర ప్రదేశ్‌లో గంగవరం రేవు ప్రాజెక్టుతో సహా ముఖ్యమైన ప్రాజెక్టుల కాంట్రాక్టులన్నింటినీ అదానీ కైవసం చేసుకు న్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీతో తనకున్న పలుకుబడి, పరిచయాలను వినియోగించుకుని అదానీ ఆకాశమంత ఎత్తు ఎదిగారని పార్లమెంటులో సాక్షాత్తూ మోడీ ఎదురుగానే కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. అంతేకాదు, మోడీతో సహా అదానీ విమానంలో ప్రయాణిం చారని ఆరోపించడమే కాదు, ఆ ఫోటోల కాపీలను చూపించారు. అయితే, అదానీ తన ను ఇంతగా ముంచేస్తాడని మోదీ ఊహించలేదు.ఇద్దరూ ఒకే రాష్ట్రానికి చెందిన వారు కావడం వల్ల కార్పొరేట్ దిగ్గజంగా అదానీ ఎదిగేందుకు మోడీ సంపూర్ణ సహకా రం అందించారనేది ఆయన మాటల్లో అంతర్లీనంగా వ్యక్తం అయిన అభిప్రాయాలను బట్టి స్పష్టం అవుతోంది. పార్లమెంటులోనే మోడీ పారిశ్రామికవేత్తలూ, కార్పొరేట్ అధిపతులను చిన్న బుచ్చవద్దని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. మన దేశంలో కార్పొరేట్ సంస్థలు, స్టాక్ మార్కె ట్ల అక్రమాలను నియంత్రించేందుకు సెబీ వంటి రెగ్యు లేటర్ సంస్థలు ఉన్నప్పటికీ అవన్నీ అధికారంలో ఉన్న పెద్దల చెప్పుచేతల్లోనే ఉన్నాయి.

హర్షద్ మెహతా షేర్ల కుంభకోణంలో ఈ విషయం బహిర్గతం అయింది. హర్షద్ మెహతా షేర్ల కుంభకోణం బయటపడినప్పుడు పార్లమెంటులోనూ, వెలుపలా రోజుల తరబడి గందర గోళం జరిగింది. స్టాక్ మార్కెట్‌పై విశ్వాసాన్ని పెంచడా నికి రెగ్యులేటరీ సంస్థలను మరింత పటిష్టం చేస్తామని ఆనాటి ప్రభుత్వం పార్లమెంటులో సభా ముఖంగా ప్రకటన చేసింది. అది జరిగి రెండు దశాబ్దాలు దాటినా పరిస్థితిలో మార్పులేదు. స్టాక్ మార్కెట్‌ని గాడిలో పెడ తామని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కూడా పార్ల మెంటులో ప్రకటన చేశారు.అయితే,ఈ రంగంలో ఉన్న వారి పలుకుబడి కారణంగా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోలేకపోతున్నాయి. సులభంగా డబ్బు సంపాదిం చేందుకు ఇది ఒక మార్గంగా ఎంచుకుంటున్న వారంతా ప్రభుత్వానికి సన్నిహితులే. ఇంకా చెప్పాలంటే వారే ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారన్నా ఆశ్చర్యం లేదు. రెగ్యులే టరీ సంస్థల పట్ల విశ్వాసాన్ని పెంచడానికి ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

## దళితుల పట్ల వివక్ష ఇంకా ఎంత కాలం?

ఎన్ని చట్టాలు తెచ్చినా, ఎన్ని సంస్కరణలు ప్రవేశపెడుతున్న దేశంలో దళితులపై వివక్ష తొలగిపోవడం లేదు. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో



దేవాలయాలలో గుడిలోకి దళితులకు ప్రవేశం లేదు. కేవలం అగ్రవర్ణాల వారికి మాత్రమే ఆలయ ప్రవేశం, దళితులను రానిస్తే ఆలయ పవిత్రత, మర్యాదలు మంతకలిసిపోతాయన్న రీతిలో కొన్ని వర్ణాల వారు ప్రవర్తిస్తున్నారు. అంతేకాకుండా ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్, బీహార్ రాష్ట్రాలలో అయితే దళిత మహిళలు లేదా పురుషులు బజార్తలో నడిచేటప్పుడు చెప్పులు వేసుకోకూడదు అన్న నిబంధనలు ఉన్నాయి. అధిక కులాల వాళ్లు ఉన్న ప్రాంతాల్లో దళితులు చెప్పులు చేతిలో పట్టుకొని వెళ్లాలన్న నిబంధనలు ఇప్పటికీ అనేక గ్రామాల్లో కొనసాగుతున్నాయి. అంతేకాకుండా,అధిక కులాల వాళ్ల ఇళ్లకి వెళితే దళితులు మిగతా అందరిలాగా కుర్చీల్లో లేదా మంచం మీద కూర్చొనే అవకాశం ఉండదు. నేలపై కూర్చోవాల్సిందే. దళితుల పట్ల ఇలాంటి వివక్ష నేటి కంప్యూటర్ యుగంలో కూడా ఉండటం మరింత బాధాకరం.

అయితే తాజాగా పెళ్లి చేసుకొని గుడిలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఓ దళిత జంటకు చేదు అనుభవం ఎదురైంది. దళితులకు ఆలయంలోకి ప్రవేశం లేదంటూ ఆ దళిత జంటను పూజారులు అడ్డుకున్న ఘటన రాజస్తాన్ రాష్ట్రంలోని జలోర్ జిల్లాలోని అహోర్ సబ్‌డివిజన్ పరిధిలోని నీలకంఠ గ్రామంలో ఇటీవల చోటచేసుకుంది. ఈ ఘటనలో దేవాలయంలో ప్రార్థనలు చేసేందుకు కొత్తగా పెళ్లి అయిన దళిత జంట వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే ఆలయంలోకి దళితులకు ప్రవేశం లేదంటూ ఆలయ ప్రధాన ద్వారం వద్ద పూజారి..ఆ దంపతులను ఆడ్డుకున్నట్లు తెలుస్తోంది. తమను గుడిలోకి అనుమతివ్వకపోవడంపై భాధిత కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. అనంతరం పూజారిపై షెడ్యూల్డ్ కులం మరియు షెడ్యూల్డ్ తెగ (అత్యాచారాల నిరోధక) చట్టం కింద కేసు పెట్టారు. ఇటువంటి సంఘటనలు దేశవ్యాప్తంగా అనేకం జరుగుతున్నాయి. దళితులపై వివక్ష కనబరచరాదని అన్ని చట్టాలు చేసినా అవి క్షేత్ర స్థాయిలో సరిగ్గా అమలవడం లేదన్న విషయం ఇటువంటి సంఘటనలు చూస్తుంటే అర్థమౌతొంది.

స్వాతంత్ర్యానంతరం కూడా దళితుల జీవితాల్లో మార్పు రాలేదు. స్వాతంత్ర్యం వస్తే సమాన హక్కులు, అవకాశాలు, గుర్తింపు లభిస్తుందని కలలుగన్నారు. ఆ కలలు కల్లలుగానే మిగిలిపోయాయి. దారిద్ర్యం, ఆకలి, నిరుద్యోగం, అస్పృశ్యత, కుల, వర్గ, రాజకీయ, సాంఘిక రుగ్మతలు అంతకు ముందుకంటే ఎక్కువయ్యాయి. పాలకులు మారినా, చట్టబద్ధమైన ప్రభుత్వాలు వచ్చినా.. అంటరానితనం నిర్మూలన ఒక ప్రశ్నగానే మిగిలిపోయింది.

'మహిళలు ఏ మేరకు పురోగతి సాధించారనేది కొలమానంగా నేనా జాతి ప్రగతిని అంచనా వేస్తా' అంటారు డాఎం అంబేద్కర్. కానీ, దళిత మహిళల్లో పురోగతి అనేది నేటికీ అందని ద్రాక్షగానే ఉంది. నిరక్ష్యరాస్యత, పోషకాహార లోపం, రక్తహీనత వారిని వెన్నాడుతున్నాయి. మరోవైపు లైంగిక దాడులు.. వివక్ష, అత్యాచారాలు, కులదురహంకార హత్యలు అత్యధిక భాగం దళితులపైనే జరుగుతున్నాయి. ఎస్సి, ఎస్టి అత్యాచారాల నిరోధక చట్టం ఉన్నప్పటికీ అది రక్షణ ఇవ్వలేకపోతోంది.

– సి హెచ్ ప్రతాప్

హైదరాబాద్ : 95508 51075

# ఆత్మహత్య చేసుకున్న మెడికో

## అంత్యక్రియలకు వెళ్లి వస్తూ మిత్రుడి దుర్మరణం

**నిజామాబాద్,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** అతడి వయసు నిండా రెండు పదులు మాత్రమే. వైద్యవిద్యను అభ్యసిస్తున్నాడు. మరో నాలుగు రోజుల్లో ఎంబీబీఎస్ పూర్తికానుంది. ఇంతలో ఏమైందో ఏమో ఆ విద్యార్థి ఆత్మహత్య చేసుకుని తనువు చాలించాడు. ఆ యువకుడిని కడసారి చూసేందుకు బంధుమిత్రులతో పాటు అతని మిత్రులు కూడా భారీగా తరలివెళ్లారు. అంత్యక్రియలు పూర్తికాగానే తిరిగి వెళ్తూ అతని స్నేహితుల్లో ఒక యువకుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. నిజామాబాద్ జిల్లాలో మెడిసిన్ చదువుతున్న దాసరి హర్ష (22) గత శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దాంతో ఆయన స్వగ్రామమైన మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని చింతగూడలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదివారం హర్ష బంధువులు, మిత్రులు పెద్ద సంఖ్యలో అంత్యక్రియలకు హాజరయ్యారు. అంత్యక్రియలకు హాజరైన మిత్రులు తిరిగి తమ ఇళ్లకు వెళ్తుండగా మరో ఘోరం జరిగింది. హర్షను ఆఖరిసారి చూసేందుకు వెళ్లిన దాసరి తరుణ్ (21) అనే యువకుడు తిరిగి వెళ్లేటప్పుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాల య్యాడు. బైక్‌పై వెళ్తున్న ఆయనను ఎదురుగా వచ్చిన మరో వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్నేహితులిద్దరూ ఒక్క రోజు వ్యవధిలోనే ఒకరు ఆత్మహత్య చేసుకుని, ఇంకొకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఘటన స్థానికులను కలచివేస్తున్నది.

# మద్యం, డ్రగ్స్ వినియోగంతో పెరిగిన నేరాలు

## ఆబ్కారీ శాఖ కార్యాలయం ముందు టీపీసీసీ నిరసన

**హైదరాబాద్,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** నాంపల్లిలోని ఆబ్కారీ శాఖ కార్యాలయం ముందు టీపీసీసీ నిరసన చేపట్టింది. రాష్ట్రంలో మద్యం, డ్రగ్స్, గంజాయి విచ్చలవిడిగా వినియోగంతో నేరాలు పెరిగిపోతున్నాయని కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం, డ్రగ్స్ వల్లనే మహిళలు,




బాలికలపైన దాడులు, హత్యలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్, మద్యం పెరిగి పోవడంతో సమాజంలో తీవ్రమైన ప్రభావం చూపుతుందన్నారు. తెలంగాణలో మద్యం ఆదాయం విపరీతంగా పెరిగిపోయిందని.. శాంతి భద్రతలు కూడా పూర్తిగా క్షిణిస్తున్నాయని తెలిపారు. డ్రగ్స్, మద్యం, గంజాయితో యువకులు పక్కదారి పడుతున్నారని.. తక్షణమే వీటిని నియంత్రించాలని కోరారు. అనంతరం వారు ఆబ్కారీ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు.

# కోల్‌కతాలో విమానానికి తప్పిన ముప్పు

## టేకాఫ్ సమయంలో విరిగిన ఇంజిన్ బ్లేడ్లు

**కోల్‌కతా,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** విమానం టేకాఫ్ సమయంలో ఇంజిన్ బ్లేడ్లు విరిగాయి. దీంతో ఆ విమానాన్ని వెనక్కి మళ్లించి ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం అర్ధ రాత్రి తర్వాత 1.09 గంటలకు స్పైస్‌జెట్‌కు చెందిన బోయింగ్ 737 విమానం కోల్‌కతా ఎయిర్‌పోర్ట్ నుంచి బ్యాంకాక్‌కు బయలు దేరింది. అయితే ఎయిర్‌పోర్ట్‌లో టేకాఫ్ అయిన సమయంలో ఆ విమానం ఎడమ ఇంజిన్‌లోని బ్లేడ్లు విరిగాయి. పైలట్లు వెంటనే దీనిని గ్రహించారు. ఆ విమానాన్ని వెనక్కి మళ్లించారు. 1.27 గంటలకు తిరిగి ఎయిర్‌పోర్ట్‌లో




సురక్షితంగా ఎమ్జ్గ÷న్సీ ల్యాండింగ్ చేశారు. బ్యాంకాక్‌కు వెళ్లాల్సిన 178 మంది ప్రయాణికులతోపాటు ఆరుగురు సిబ్బంది ఆ విమానంలో ఉన్నారు. కాగా, ఈ సంఘటన నేపథ్యంలో మరో విమానాన్ని ఏర్పాటు చేసినట్లు స్పైస్‌జెట్ తెలిపింది. దీంతో బ్యాంకాక్ వెళ్లేందుకు సోమవారం ఉదయం 7 గంటలకు ఆ విమానం కోల్‌కతా ఎయిర్‌పోర్ట్ నుంచి టేకాఫ్ అయినట్లు చెప్పింది. అయితే తెల్లవారుజామున 2 గంటల వరకు కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో ఎమ్జ్గన్సీ పరిస్థితి కొనసాగినట్లు స్పైస్‌జెట్ వెల్లడించింది. ఇంజిన్ బ్లేడ్లు విరిగిన విమానాన్ని బే నుంచి వాహనంతో లాక్కెళ్లినట్లు వివరించింది. టేకాఫ్ సమయంలో విమానం ఇంజిన్ బ్లేడ్లు విరిగినట్లు దర్యాప్తులో గ్రహించామని పేర్కొంది. ఈ విషయాన్ని డీజీసీఏకు నివేదించినట్లు వెల్లడించింది.

# చంద్రబాబు సభతో బిఆర్ఎస్‌లో వణుకు

## టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్

**హైదరాబాద్,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** తెలంగాణ ప్రజలను ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తాను సమర్థిస్తున్నానని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. బియ్యం గురించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వక్రీకరించవద్దని చెప్పారు. చంద్రబాబు ఒక్క మీటింగ్ పెడితే బీఆర్ఎస్ ఎందుకు భయపడు తోందని ప్రశ్నించారు. ఎన్టీఆర్ పాలనకు ముందు దొరలకు కూడా తినేందుకు బియ్యం దొరకలేదని గుర్తు చేశారు. దొడ్డు వడ్లు, గటుకు తినే పరిస్థితి ఉన్నప్పుడు ఎన్టీఆర్ పాలన మొదలైందని చెప్పారు. చంద్రబాబును విమర్శించే వాళ్లు స్క్రిప్ట్ చదువుడు మానేస్తే బాగుంటుందని మంత్రి నిరంజన్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రాంతానికి ఎవరి పాలనలో అన్యాయం జరిగిందో ప్రజలకు తెలుసని చెప్పారు. కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎందుకు పంపిణీ చేయడం లేదని కాసాని జ్ఞానేశ్వర్ ప్రశ్నించారు. నిరంజన్ రెడ్డి ఏరియా నుంచి ఇంకా వలసలు కొనసాగుతున్నా యని విమర్శించారు. చంద్రబాబు వ్యాఖ్యలపై నిరంజన్ రెడ్డితో తాను డిబేట్‌కు సిద్ధమని సవాల్ చేశారు . ఆహార భద్రత అనేది టీడీపీ వచ్చిన తరువాతే లభించిందనేని వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

# స్క్రాప్ దుకాణాల్లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** కూకట్‌పల్లిలో నాలుగు స్క్రాప్ దుకాణాల్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దాంతో పాటు పక్కనే ఉన్న మరో 2 ప్లాస్టిక్ బాటిల్ మాన్యుఫ్యాక్చరింగ్ చేసే షెడ్లకు కూడా మంటలు అంటుకోవ డంతో అందులోని సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ లో ఈ ఘటన జరిగింది. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన స్థానికులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అనంతరం ఐదు ÷ర్ ఇంజన్ల సహాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో అశోక్ లేలాండ్ వాహనంతో పాటు మారుతి కారు కూడా దగ్ధమైనట్లు కూకట్ పల్లి పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# వాహనదారుల నుండి పెండింగ్‌లో 3.5 కోట్ల బకాయిలు

## - డి.టి.వో. శ్యామ్ నాయక్

**జగిత్యాల ఫిబ్రవరి 27 (ప్రజా మంటలు):** జిల్లాలో 4000 వేల వాహనాలు టాక్స్ సుమారు 3.5 కోట్ల రూపాయలు కట్టకుండా తిరుగుతున్నట్టు గుర్తించామని జిల్లా రవాణా శాఖ అధికారి శ్యామ్ నాయక్ తెలిపారు. మార్చ్ 31 వరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు...

# బీటెక్ విద్యార్థి నవీన్ హత్య కేసు

## 17 తిరుమల వైన్స్‌లో మందు కొనుగోలు
## మద్యం మత్తుల ఉండగా గొంతు నులిమి హత్య
## 24న హత్యాస్థలంలో శరీర భాగాల కాల్చివేత
## రిమాండ్ రిపోర్టులో పోలీసులు సంచలన విషయాలు

**హైదరాబాద్,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** బీటెక్ విద్యార్థి నవీన్ హత్య కేసు నిందితుడి రిమాండ్ రిపోర్టులో పోలీసులు సంచలన విషయాలు వెల్లడించారు. మూడు నెలల క్రితమే నవీన్ హత్యకు ప్లాన్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గెట్ టు గెదర్ పార్టీ పేరుతో జనవరి 16న హత్యకు కుట్ర చేసినట్లు చెప్పారు. ఆ ప్లాన్ బెడిసి కొట్టడంతో ఫిబ్రవరి 17న ప్లాన్ చేసి హత్య చేసినట్లు తేలింది. బ్రహ్మణపల్లిలోని స్నేహితుడు హసన్‌కు నవీన్ హత్య గురించి చెప్పి, అతని ఇంట్లోనే నిందితుడు కృష్ణ గడిపినట్లు రిమాండ్ రిపోర్టు ద్వారా తెలిసింది.

అంతేగాక ప్రియురాలిని కలిసి నవీన్ హత్య గురించి తెలపగా.. పోలీసులకు లొంగిపోవాలని ఆమె చెప్పినా వినకుండా వరంగల్ వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఫిబ్రవరి 17న రాత్రి 9 గంటలకు పెద్దంబర్ పేట్ తిరుమల వైన్స్ వద్ద నవీన్, హరిహర కృష్ణ మద్యం సేవించినట్లు సీసీఫుటేజ్‌లో రికార్డయిన దృశ్యాల ఆధారంగా పోలీసులు గుర్తించారు.

ఎల్బీనగర్, నాగోల్, ముసారంబాగ్, సైదాబాద్, చైతన్యపురి, కొత్తపేట ప్రాంతాల్లో ఇద్దరూ కలిసి తిరిగినట్లు ఆధారాలు సేకరించారు. ఆ తర్వాత రాత్రి 12 గంటలకు యువతి ప్రేమ వ్యవహారంలో పరస్పరం వాగ్వాదం జరిగినట్లు పోలీసులు అనుమానించారు. దీంతో ముందు నవీన్‌ను గొంతు నులిమి కృష్ణ




హత్య చేసినట్లు పోలీసులు చెప్పారు. అనంతరం కత్తితో నవీన్ శరీర భాగాలను వేరు చేసి.. తలతో సహా శరీర భాగాలను బ్యాగ్‌లో తీసుకెళ్లినట్లు వివరించారు. తన మొబైల్ ను హైదరాబాద్‌లోని ఇంట్లో వదిలేసిన నిందితుడు.. కోదాడ, ఖమ్మం, వైజాగ్‌లో రెండు రోజుల పాటు గడిపినట్లు విచారణలో వెల్లడైంది. ఫిబ్రవరి 23న తిరిగి వరంగల్ చేరుకొని తండ్రికి నవీన్ హత్య గురించి చెప్పినట్లు పోలీసులు తెలిపారు. మరుసటి రోజు తిరిగి బ్రహ్మణపల్లి హత్యా స్థలంలో నవీన్ శరీర భాగాలతో పాటు ఆధారాలను తగలబెట్టిన కృష్ణ.. అనంతరం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు లొంగిపోయాడు. ఇక కృష్ణను 14 రోజుల రిమాండ్ నిమిత్తం.. చర్లపల్లి జైలుకు తరలించారు.

# తునికాకు సేకరణకు అన్ని ఏర్పాట్లు

## కూలీలకు బోనస్ చెల్లింపు పక్రియ
## ఆసిఫాబాద్ జిల్లాలో ప్రారంభించిన మంత్రి ఇంద్రకరణ్

**కుమ్రంభీం ఆసిఫాబాద్,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** తునికాకు సేకరణకు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. తునికాకు సేకరణ కూలీలకు




బోనస్ చెల్లింపు పక్రియను మంత్రి కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రారంభించారు. సిర్పూర్ నియోజవర్గంలోని కర్జెల్లి రేంజ్‌లోని చింతలమానేపల్లిలో లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తునికాకు సేకరించే కూలీలకు లబ్ది చేకూర్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం తునికాకు సేకరణ చార్జీలతో పాటు రెవెన్యూ నెట్ షేర్‌ను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుం దన్నారు. ఏజెన్సీ గ్రామాలకు ఇది ఉపాధి వనరని, రాష్ట్రవ్యాప్తంగా 2016 నుంచి 2021 వరకు రూ.200 కోట్లను బోనస్ చెల్లించినట్లు తెలిపారు. బీడీ ఆకుల సేకరణ రేట్ పెంచుతూ జీవోను జారీ చేసినట్లు చెప్పారు. కట్టకు రూ.2.05 నుంచి రూ.3కు పెంచామన్నారు.

ఈ సీజన్ నుంచి రేట్లు వర్తింపజేస్తున్నామన్నారు. ÷ాష్ట్రవ్యాప్తంగా రూ. 277.88 కోట్లను బోనస్ చెల్లింపు పక్రియను ప్రారంభించినట్లు చెప్పారు. లబ్దిదారులకు నేరుగా వారి ఖాతాల్లోనే బోనస్ డబ్బులు జమ చేస్తామని చెప్పారు. ఈ సీజన్‌లో 2.27 లక్షల స్టాండర్డ్ బ్యాగుల తునికాకును సేకరించి, విక్రయించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. మే నెల చివరి వరకు పూర్తి చేసేలా కసరత్తు చేశామని, సీజన్ లో దాదాపుగా 75వేల మంది తునికాకు సేకరణలో పాల్గొంటారన్నారు. 2023లో తునికాకు సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 జిల్లాల్లో 225 యూనిట్లలో తునికాకును అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అటవీ శాఖ విక్రయిస్తుందన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో తునికాకు కూలీలకు రూ.31.58 కోట్ల బోనస్‌ను చెల్లించే పక్రియను ఇవాళ ఇక్కడి నుంచే ప్రారంభిస్తామన్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 63,573 మంది లబ్దిదారులకు రూ.31.58కోట్లు చెల్లిస్తుండగా.. సిర్పూర్ నియోజకవర్గంలోనే 48,418 మంది లబ్దిదారులకు రూ.26.98 కోట్లు చెల్లిస్తున్నా మన్నారు.

# ప్రీతి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ

## హెచ్చార్సీలో ఫిర్యాదు చేసిన ఓయూ జెఏసి
## నిరసన ప్రదర్శన చేపట్టిన బజరంగ్ దళ్

**హైదరాబాద్,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి కేసులో మరో ట్విస్ట్ తెరపైకి వచ్చింది. ప్రీతిది ఆత్మహత్యా లేక హత్యనా అనే అనుమానాలపై విచారణ చేయాలని ఓయూ జేఏసీ కోరింది. ఈ విషయం పై హెచ్‌ఆర్‌సీని ఓయూ జేఏసీ ఆశ్రయించింది. ప్రీతి మృతిపై సిట్టింగ్ జడ్జ్ చేత విచారణ జరిపించాలని సురేష్ యాదవ్ డిమాండ్ చేశారు. మెడికో విద్యార్థిని ప్రీతి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని సోమవారం హెచ్ఆర్సీలో ఓయూ జేఏసీ పిటిషన్ దాఖలు చేసింది. ప్రీతి మృతదేహానికి జూనియర్ డాక్టర్లతో పోస్టుమార్టం నిర్వహించారని ఫిర్యాదులో పేర్కొంది. నిమ్స్, గాంధీ ఆస్పత్రిలో పోలీసులు వ్యవహరించిన తీరుపై విచారణ చేయాలని హెచ్‌ఆర్‌సీని ఓయూ జేఏసీ కోరింది. ఈ సందర్భంగా ఓయూ జేఏసీ నేత సురేష్ యాదవ్ మాట్లాడుతూ... మెడికో విద్యార్థిని ప్రీతి మృతిపై మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించినట్లు తెలిపారు. ప్రీతి కుటుంబాన్ని డీసీపీ జోయల్ డెవిస్ తీవ్రంగా ఇబ్బందులు పెట్టారన్నారు. గాంధీలో నాలుగు అంచెల భద్రత ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులను అనుమతించలేదని తెలిపారు. ప్రీతి మృతదేహానికి సీనియర్ డాక్టర్స్ చేత పోస్టుమార్టం చేయించలేదన్నారు. జూనియర్ డాక్టర్స్ చేత పోస్టుమార్టం చేయించారని మండిపడ్డారు. ఉగ్రవాదుల మాదిరిగా పోలీసులు వ్యవహరించారని అన్నారు. ప్రీతిని తరలిస్తున్న అంబులెన్స్‌లో కనీసం కుటుంబ సభ్యులకు కూడా అనుమతి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప్పల్‌లో తన నివాసంలో ఆపాలని కుటుంబ సభ్యులు కోరినా పోలీసులు అనుమతి ఇవ్వలేదన్నారు. ఇదిలావుంటే సీనియర్ల ర్యాగింగ్ భూతానికి బలైన ధరావత్ ప్రీతి మృతి పట్ల రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెలువెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, కాకతీయ మెడికల్ కళాశాల వైఫల్యం వల్లనే ప్రీతి మృతి చెందిందని బజరంగదళ్ నాయకులు కూకట్‌పల్లి వై జంక్షన్‌లో




నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మలు దగ్ధం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రీతి ఫిర్యాదు చేసిన సమయంలో వైద్య కళాశాల సిబ్బంది, పోలీసులు స్పందించి ఉంటే ఈ ఘోరం జరిగేది కాదని ఆరోపించారు. స్థానిక నాయకుల నుండి రాష్ట్ర నాయకుల వరకు పోలీసులను తమ చెప్పు చేతల్లో పెట్టుకుని వారి విధులను నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి కళాశాలలో ఇదే తంతు కొనసాగుతుందని.. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన బుద్ధిని మార్చుకోక పోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపడతామని బజరంగదళ్ నాయకులు హెచ్చరించారు.



# ఐక్యతతో సంఘ అభివృద్ధికి కృషి చేయాలి

## ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**జగిత్యాల ఫిబ్రవరి 27( ప్రజా మంటలు):** బ్రాహ్మణులందరూ ఐక్యతతో సంఘ అభివృద్ధి కృషి చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు జగిత్యాల బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు జరగగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కార్యవర్గాన్ని అభినందించారు. నూతన కార్యవర్గాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యులందరూ సమిష్టిగా ఐక్యతతో సంఘ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు .బ్రాహ్మణ సంఘ భవన నిర్మాణానికి తనవంతు ఆర్థిక సహాయం చేస్తా నని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. నూతన కార్యవర్గం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను శాలువతో సత్కరించారు. అనంతరం బ్రాహ్మణ సంఘ పెద్దలు ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో సభాపతి తిగుళ్ల విశ్వనాథ శర్మ, పట్టణ పురోహితులు రుద్రాంగి గోపాలకృష్ణశర్మ, సిరిసిల్ల రఘుపతి శర్మ తోపాటు నూతన కార్యవర్గ సభ్యులు, అధ్యక్ష, కార్యదర్శులు, సంఘ సభ్యులు, పాల్గొన్నారు.




# మలక్‌పేట మార్కెట్‌కు భారీగా మిర్చిపంట

## ధరలు పెరగడంతో పంటను తరలించిన రైతులు

**హైదరాబాద్,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే మిర్చితో మలక్‌పేట్ వ్యవసాయ మార్కెట్



కళకళలాడుతోంది. మిర్చి వ్యాపారం చేసేందుకు వ్యాపారులు, రైతులు పెద్దఎత్తున తరలి వస్తున్నారు. ఈ ఏడాది మిర్చి పంట ధరలు 25 శాతం నుంచి 35 శాతం పెరగటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పోయిన ఏడాది మిర్చి ధర క్వింటాల్ కు రూ.14 వేలు ఉండగా ప్రస్తుతం క్వింటాల్ కు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు పలుకుతోంది. అయితే, తెలంగాణలోని అనేక ప్రాంతాల్లో మిర్చి పంటకు తెగుళ్లు రావడం, వర్షాల కారణంగా దిగుబడి తగ్గిపోవడమే ధరల పెరుగుదలకు కారణమని మలక్ పేట్ మార్కెట్ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఎం. దామోదర్ అన్నాడు. మహబూబ్ నగర్, గద్వాల్, నాగర్ కర్నూల్, ఖమ్మం, అలంపూర్ ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్ లోని కర్నూల్ జిల్లా నుంచి మలక్ పేట్ మార్కెట్ కు రోజుకు 9000 బస్తాల మిర్చి వస్తుంది. సూపర్ 10 రకానికి రూ.23 వేలు, బాడిగ రకానికి రూ.30 వేలు పలుకుతున్నాయి.

# గన్‌తో కాల్చుకుని వైద్యుడు మృతి

**హైదరాబాద్,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** హైదరాబాద్ బంజారాహిల్స్‌లో డాక్టర్ మజార్ అలీఖాన్ గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 లోని తన ఇంట్లో ఈ ఘటన జరిగింద. అయితే కుటుంబ కలహాలతో మజార్ ఆత్మహత్యాయత్నం చేశాడు. తీవ్ర గాయాలైన మజార్ ను కుటుంబ సభ్యులు అపోలో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు మజార్ ఎంఐఎం అధినేత అసుదద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీకి బంధువు. ఈ విషయం తెలుసుకున్న అస దుద్దీన్, అక్బరుద్దీన్ అపోలో ఆస్పత్రికి చేరుకున్నారు.

# చల్లని బీర్లు అమ్మేలా చేయండి

## ప్రజావాణి ఫిర్యాదులో ఓ యువకుడి వినతి

జగిత్యాల,ఫిబ్రవరి27(ప్రజా మంటలు): ప్రజావాణి తీరు అభాసుపాలవుతోంది. ప్రతిదీ ఫిర్యాదుగా మారుతోంది. తాజాగా జగిత్యాలలో జరిగిన ఓ ఫిర్యాదు తీరు దీనికి అద్దం పట్టింది. కింగ్ ఫిషర్ బీర్లు అమ్మడం లేదంటూ ఓ యవకుడు ఏకంగా ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన జగిత్యాల పట్టణంలో చోటుచేసుకుంది. జగిత్యాలలో చల్లని బీర్లను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ బీరం రాజేష్ అనే యవకుడు ప్రజావాణిలో అదనపు కలెక్టర్ లతకు వినతి పత్రాన్ని అందజేశాడు. జిల్లాలో కల్తీ మద్యం అమ్ముతున్నారని దీంతో యూరిక్ యాసిడ్ హెల్త్ ప్రాబ్లమ్ వస్తున్నాయని తన ఫిర్యాదులో ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లాలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఉన్నాయని, అందులో ఒక్కో బీర్ కు రూ. 200 నుంచి 300 వరకు వసూలు చేస్తూ ప్రజల నుండి దోపిడీ చేస్తున్నారని రాజేశ్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరాడు.

# ప్రీతి మృతి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

## పరిగి బస్టాండ్ ముందు విద్యార్థులు నిరసన

**వికారాబాద్,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** మెడికో ప్రీతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా పరిగి బస్టాండ్ ముందు విద్యార్థులు నిరసన తెలిపారు. ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలంటూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని.. రోజు ఏదో ఒక చోట ర్యాగింగ్, హత్యాచారాలు,సైకో ప్రేమికుల చేత చిన్నారి నుంచి వృద్ధుల వరకు అందరిపై ఆకృత్యాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రీతి చికిత్స పొందుతున్నప్పుడు సైలెంట్ గా ఉన్న ప్రభుత్వం మరణించగానే కంటి తుడుపు చర్యలు చేపట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు తెలంగాణ రాష్ట్రంలో హోంమంత్రి ఉన్నారా..ఉంటే పాలన చేత కాకపోతే రాజీనామా చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. మహిళల పై ఆకృత్యాలకు కారణమైన మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాల సరఫరా జోరుగా జరుగుతుంటే ప్రభుత్వం చూసీచూడనట్టు వ్యవహరించడం వల్లే దాడులు పెరుగుతున్నాయని ఎన్ఎస్ యుఐ నాయకులు విమర్శించారు. ప్రీతి లాగా మరో అమ్మాయికి అన్యాయం జరగొద్దంటే..ప్రీతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి.. లేకపోతే యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# యమున హైవేపై ఘోర ప్రమాదం

## డివైడర్‌ను ఢీకొన్న బోల్తాపడ్డ బస్సు
## చిన్నారి సహా ముగ్గురు మృతి

**లక్నో,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** ఉత్తర్ ప్రదేశ్ లోని మధుర - యమున ఎక్స్ ప్రెస్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఢిల్లీ నుంచి బిహార్ వెళ్తున్న డబుల్ డెక్కర్ బస్సు డివైడర్ ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ చిన్నారితో సహా ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, 12మందికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటన రాత్రి 11.30 గంటలకు జరగగా.. అర్ధరాత్రి వరకు అక్కడ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

# ప్రీతి మృతికి కారకులపై చర్యలు

## మావోయిస్ట్ కార్యదర్శి వెంకట్ డిమాండ్

**జయశంకర్ భూపాలపల్లి,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** మెడికో ప్రీతి మృతికి కారకులైనవారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మావోయిస్టులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జయశంకర్, మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి డివిజన్ మావోయిస్ట్ పార్టీ కార్యదర్శి వెంకట్ సోషల్ మీడియాలో లేఖ విడుదల చేశారు. మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని చెబుతున్న ప్రభుత్వాలు వారికి రక్షణ కల్పించడంలో విఫలమవుతున్నాయని మండిపడ్డారు. వరంగల్ లో వైద్య విద్యార్థిని ప్రీతిని సీనియర్ సైఫ్ ర్యాగింగ్ చేయడం వల్లే ఆత్మహత్య చేసుకున్నా యాజమాన్యం ఆ విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తోందని వెంకట్ ఆరోపించారు. ప్రీతికి న్యాయం చేయాలని విద్యార్థులు ధర్నాలు చేస్తుంటే ఆమె ఆత్మహత్యకు సైఫ్ కారణం కాదని హాస్పిటల్ యాజమాన్యం బుకాయిస్తోందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆఫీసుల్లో మహిళలపై వేధింపులు, కాలేజీల్లో ర్యాగింగ్ నిత్యకృత్యమయ్యాయని ఫలితంగా మహిళలు ఇంటికే పరిమితమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో మహిళలంతా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## వైద్య విద్యార్థి మృతికి కారణమైన

# నిందితున్ని కఠినంగా శిక్షించాలి

**యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్ నాయక్**

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** హనుమకొండలోని మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థి డా. ప్రీతిపై ర్యాగింగ్ చేసి ఆమె చావుకు కారణమైన నిందితున్ని వెంటనే కఠినంగా శిక్షించాలని భీమదేవరపల్లి మండల కేంద్రంలో యుఎస్ఎఫ్ఐ



ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ర్యాగింగ్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ర్యాగింగ్ నిరోధక చట్టం అమలు చేయక పోవడంలో నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. తక్షణమే ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన హెచ్ఓడి, ప్రిన్సిపాల్ ను తక్షణం విధుల నుండి తొలగించి, కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

# ధర్మకంచలో స్పెల్ బీ కార్యక్రమం

**జనగామ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** జెడ్పిహెచ్ఎస్ ధర్మకంచ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోగల పాఠశాలలోని 3,4,5 వ తరగతుల విద్యార్థులకు ఎంపిపిఎస్ సంజయ్ నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్. శ్రీనివాసు ఆధ్వర్యంలో



స్పెల్ బీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, శ్రీమతి గౌసియా, నర్సింహ్మారావు ముఖ్య అతిధిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా కె. రాము మాట్లాడుతూ ప్రాధమిక తరగతుల స్థాయి నుండే విద్యార్థులలో ప్రపంచ భాష ఆంగ్ల బాషపై ఆసక్తి పట్టుదల, పోటీ సామర్థ్యం పెరగడానికి ఉపయొగపడే కార్యక్రమాన్ని జనగామ జిల్లాలో మ్మొదటిసారిగా ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, పాఠశాలల ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో నేర్చుకొని కన్న తల్లిదండ్రులకు పుట్టి పెరిగిన ఊరికి మన భారతదేశానికి మంచి పేరు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు స్వర్గం ప్రకాశం, స్వంతంగా 3 వేల రుపాయల విలువగల బహుమతులను విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధిలోని ప్రాధమిక ప్రాధమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎం. వీరనర్సయ్య, సి.హెచ్. సత్యనారాయణ రెడ్డి, బి. శ్రీనివాసు,రాములు, రాములు చక్రాధర్, అనురాధ, వాణిశ్రీ, రిజ్వానా, చాంద్ బీబి, హిమబిందు, క్రిష్ణవేణి, హరిత దీనామణి పాల్గొన్నారు.

## ఐక్యత తో సంఘం

# అభివృద్ధికి కృషి చేయాలి

**ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

**జగిత్యాల ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** జగిత్యాల అఖిల బ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అభినందించారు. కార్యవర్గం





ఐక్యతతో సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం పెద్దలు ఎమ్మెల్యేను సత్కరించి ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో సభాపతి బ్రాహ్మణ సంఘ సభాపతి తిగుళ్ల విష్ణు శర్మ, పట్టణ పురోహితులు రుద్రంగి గోపాలకృష్ణ శర్మ, సిరిసిల్ల రఘుపతి శర్మ, రాజేందర్ శర్మ, నూతన కార్యవర్గ అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రీతి మరణానికి కారణమైన సైఫ్, హెచ్.ఓ.డీ. లను చట్టరీత్యా శిక్షించాలి

**జనగామ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** ర్యాగింగ్ కారణంగా 6 రోజుల క్రితం ఆత్మహత్యకి పాల్పడి ఆదివారం రాత్రి మరణించిన వైద్య విద్యార్థిని ప్రీతి మరణానికి కారణమైన సీనియర్ విద్యార్థి సైఫ్, అనస్తీషియా డిపార్ట్మెంట్ హెడ్ లను చట్టపరంగా శిక్షించి, ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ జనగామ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

**మహిళా కాంగ్రెస్ యన్.యస్.యు.ఐ. ఆధ్వర్యంలో....**

జనగామలో జిల్లాలో మహిళా కాంగ్రెస్ యన్.యస్.యు.ఐ. ఆధ్వర్యంలో నిందితులను వెంటనే శిక్షించాలని మానవహారం ధర్నా నిర్వహించారు. ప్రీతి స్వగ్రామం జనగామ జిల్లా ముండ్రాయి గిర్ని తండా లో భౌతిక గాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నీలం పద్మ, బడికె ఇందిరా, ఇందిర సునావత్ రాధ మాట్లాడుతూ చదువు కోసం వెళ్లిన ప్రీతి శవమై ఇంటికి రావడం ప్రీతి తల్లిదండ్రులనే కాక, మొత్తం సమాజాన్నే బాధించిందని , విద్య నేర్పి సమాజానికి గొప్ప విద్యార్థులను అందివ్వాల్సిన విద్యాలయాలు ర్యాగింగ్ భూతంతో నిండిపోయి తల్లిదండ్రులకు బిడ్డల శవాలను ఇస్తున్నాయని, ప్రీతి విషయంలో కూడా జరిగింది అదే అని, సైఫ్ అనే సీనియర్ విద్యార్థితో సమస్య ఉంది అని ప్రిన్సిపాల్ కి చెప్తే సంబంధిత హెచ్.ఓ.డి. ఆ విద్యార్థిపై ఎలాంటి చర్య తీసుకోకుండా చోద్యం చూశాడనీ, కంప్లైంట్ ఇచ్చాక ప్రీతిని మానసికంగా మరింత ఇబ్బందులకు గురి చేశారనీ, లాబ్ మార్స్క్, ఇంటర్నల్ మార్క్స్ వేయము, నిన్ను డాక్టర్ కానివ్వము అనే బెదిరింపులకు గురి చేసి తనకు బ్రతుకు మీదే ఆశ లేకుండా చేసి చివరికి చనిపోయేలా చేసారని అన్నారు. కాలేజీల్లో ర్యాగింగ్ సమస్యను లేకుండా చేయాలని ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం నుండి ఎలాంటి చర్యలు లేవనీ, ర్యాగింగ్ చేస్తే చట్టరీత్య శిక్షిస్తాం ర్యాగింగ్ నేరం అని నామమాత్రంగా ప్రకటిస్తూ కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రీతి



లాంటి వాళ్ళు బలవుతున్నారని అన్నారు. ఆయా డిపార్ట్మెంట్ హెచ్.ఓ.డీ. లు కూడా సీనియర్ విద్యార్థులు చెప్పిన వాటికి తలూపుతూ పరోక్షంగా ర్యాగింగుకి అండగా వుంటున్నారని , ప్రీతి కంప్లైంట్ ఇచ్చినా సైఫ్ పై ఎలాంటి చర్య తీసుకోకపోవడం వేధింపులు ఎక్కువవ్వడం వల్లే ప్రీతి ఇలాంటి నిర్ణయం తీసుకుందని, ప్రీతి మరణానికి కారణమైన సైఫ్ ను అలాగే డిపార్ట్మెంట్ హెడ్ లను వెంటనే చట్టపరంగా శిక్షించాలనీ, ఇలాంటి సంఘటనలు మళ్ళీ పునరావృతం కాకుండా ప్రభుత్వం నుండీ కాలేజీ యాజమాన్యాల నుండి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా తెలంగాణ మహిళా కాంగ్రెస్ మహిళలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కళ్యాణి, జనగామ మండల పార్టీ అధ్యక్షురాలు కాముని జయ సుజాత పాల్గొన్నారు. సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఎన్.ఎస్.యు.ఐ జనగామ జిల్లా అధ్యక్షులు చిలువేరు అభి గౌడ్, సేవాలాల్ సేన ఆధ్వర్యంలో జనగామ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చిలువేరు అభి గౌడ్, సేవలాల్ సేన జిల్లా అధ్యక్షులు శంకర్ నాయక్



మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు సాయి, గోపి, ప్రేమ్, శివ, నవీన్, సేవాలాల్ సేన నాయకులు ఉపాధ్యక్షులు బానోత్ మహేందర్, భూక్య రాజు నాయక్, సేవాలాల్ విద్యార్థి సేన జిల్లా నాయకులు లౌడియా అనిల్ చౌహాన్, ధరావత్ ప్రకాష్, గుగులోత్ రాజేందర్ పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ టీజీవిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎఫ్ఐ, టిజివిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ ప్రీతి కుటుంబానికి న్యాయం చేసి, జమున కళాశాలలో ర్యాగింగ్ వలన మరణించిన రక్షిత మరణం పై విచారణ జరిపించాలని స్థానిక జిల్లా కేంద్రంలోని చౌరస్తా వద్ద ర్యాగింగ్ పాల్పడుతున్న వారి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ టిజివిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు దడిగ సందీప్ అజ్మీర సురేష్ లు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బొట్టు శివ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తేజవాత్ గణేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు, దూదిపాల రంజిత్ రెడ్డి, పవన్, మోహన్, అరవింద్, దీప్తి, సాయి పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమ పాలన సాధ్యం

**జనగామ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య ఆదేశాల మేరకుజనగామ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 12వ వార్డులో హాత్ సే హాత్ జోడో యాత్రను గడప గడప కు రాహుల్ గాంధీ పాదయాత్ర సందేశం తెలియజేశారు. హాత్ సే హాత్ జోడో అభియాన్ పాదయాత్ర లో పాల్గోన్న జనగామ పట్టణలోని 12వ వార్డు లో ఇంటింటికి రాహుల్ గాంధీ సందేశాన్ని కరపత్రాల ద్వారా పంపిణీ చేశారు. అనంతరం మాజీ కౌన్సిలర్ బత్తిని శ్రీశైలం జనగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొన్నె మహేందర్ రెడ్డి, జనగామ పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోడం శ్రీనివాస్, కొండ శ్రీనివాస్ బిర్రు సత్యనారాయణ,



నోముల రాజు మాట్లాడుతూ.... రాహుల్ గాంధీ సుధీర్ఘ పాదయాత్ర సందేశాన్ని,బిజేపి,టిఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలను మభ్య పెడుతూ చేస్తున్న మోసాలను తెలిపే సందేశాన్ని కరపత్రం రూపంలో గడప గడపకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ పట్టణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు మోటే శ్రీనివాస్ జనగామ జిల్లా నాయకులు కట్ట కృష్ణ జనగామ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు యండి మాజిద్ జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల సతిష్ జనగామ మండల ప్రధాన కార్యదర్శి సలేంద్ర శ్రీనివాస్ దొంతుల వెంకన్న కొండ కిరణ్ మైనార్టీ సెల్ నాయకులు జఫర్ షరీఫ్, మాచర్ల శ్రీనివాస్, బుదారపు అశోక్, పిట్టల రాజు, మహేశ్వరం శ్రీనివాస్, జయ మల్లేశ్, సుల్తాన్ గోవింద రెడ్డి, పల్లా శ్రీనివాస్, మంగళంపల్లి ఎల్లేష్, రచ్చ శ్రీనివాస్, చక్రాల దేవనందు, వల్లల బానుచందర్, కోడం నరసింహులు, దేవరకొండ అశోక్, జనగామ నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ యండి ఫయాజ్, చింతకింది నరేష్ యూత్ కాంగ్రెస్ నాయకులు సౌద మహేష్, పులిగిల్లా శివ యాదవ్, బెజడి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఓసీ పెట్రోల్ పంపులో భారీ మోసం

**ఎల్కతుర్తి ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ దగ్గరలో ఉన్న ఐఓసీ పెట్రోల్ పంపు వినియోగదారులకు తెలియకుండానే భారీ మోసానికి పాల్పడుతున్నారు ఒక వినియోగదారుడు తన వాహనంలో 350 రూపాయల పెట్రోలు పోయించు కొని బండి స్టార్ట్ చేసుకొని బయలుదేరగా 100 మీటర్ల దూరం వెళ్ళగానే ఆగిపోయినది మళ్లీ తిరిగి స్టార్ట్ కాకపోగా మెకానిక్ చూపించగా పెట్రోల్లో మొత్తం వాటర్ వచ్చాయని మెకానిక్ తెలియజేశారు వెంటనే తిరిగి బంకు వద్దకు చేరుకొని పెట్రోల్ లో మొత్తం వాటర్ ఉంది ఏందీ అని అడగగా సిబ్బంది వాహనదారులపై దురుసుగా ప్రవర్తించారు జనం



గుమ్మిగుడి పెట్రోల్ మొత్తం బయటికి తీసి చూడగా పావు తక్కువ మూడు లీటర్లు ఉన్నది ఇష్టం వచ్చిన చోట చెప్పు ఇంతకుముందు కూడా ఈ బంకు రెండుసార్లు ఫీల్ చేయడం జరిగినది అయినా కూడా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు చూస్తున్నారు మూడు లీటర్ల నర పెట్రోల్ పోయించగా తిరిగి కొలత చేయగా ఆఫ్ లీటర్ పెట్రోల్ తక్కువ వచ్చినది దీని విషయంపై యజమాని అడగగా దీంతో పాటు పెట్రోల్ లో వాటర్ కూడా వచ్చింది ఏమిటి అని ప్రశ్నించగా అలాగే ఉంటుంది మీ ఇష్టం ఉంటే పోయించుకోండి లేకపోతే లేదు అని సమాధానం ఇచ్చాడు ఇప్పటికైనా ఇది రెండో సారో మూడో సారో అని



వినియోగదారులు చెప్తున్నారు దీనికి సంబంధించిన వార్త ఇంతకుముందు ప్రచురణ అయినప్పటికీ దీనికి సంబంధించిన అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు ఇప్పటికైనా దీనికి సంబంధించిన అధికారులు పట్టించుకోని ఈ బంకు పైన తగిన చర్యలు తీసుకోవాలని వాహనాదారులు గ్రామస్తులు తదితరులు కోరారు.

## మెడికల్ విద్యార్థిని ధరావత్ ప్రీతిది

# ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

**జనగామ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** గత 5 రోజుల నుండి నిమ్స్ లో చికిత్స పొందుతూ మృతి చెందిన మెడికల్ విద్యార్థిని ధరావత్ ప్రీతిది ముమ్మాటికి ప్రభుత్వ హత్యానే అని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్ డిమాండ్ చేశారు. హత్యకు కారణమైన సీనియర్ సైఫును వెంటనే ఉరితీయాలని, అదేవిధంగా తనను వేధిస్తున్నాడని యాజమాన్యానికి చెప్పినా కూడా పట్టించుకోని హెచ్ఓడిని మరియు ప్రిన్సిపాల్ ని వెంటనే సస్పెండ్ చేయాలని, ప్రీతి కుటుంబానికి వెంటనే 50 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి అని యువజన కాంగ్రెస్ పక్షాన డిమాండ్ చేశారు.



## పోలీస్ కానిస్టేబుల్ వెంకట రమణాచారి జ్ఞాపకార్థం

# స్మారక ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్

**గొల్లపల్లి ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలంలో తిర్మలాపురం (పిడి) గొల్లపల్లి పోలీస్ స్టేషన్లో పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన స్వర్గీయ వేములవాడ వెంకటరమణాచారి



జ్ఞాపకార్థం అతడి బాల్యమిత్రుల ఆధ్వర్యంలో ఎస్సై దత్తాద్రి, సోమవారం ప్రారంభించారు. పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన చారి ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాల్య స్నేహితులు కలిసి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు ఈ సందర్భంగా చారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన పోలీసులు కానిస్టేబుల్ గా చేసిన సేవలను కొనియాడారు. బాల్యమిత్రుని యాదిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న మిత్రులను ఎస్సై దత్తాద్రి అభినందించారు. ప్రథమ బహుమతి జట్టుకు రూ. 8000 ద్వితీయ విజేత జట్టుకు 4000 ప్రైస్ మనీ లు బహుమతులుగా అందజేశామని నిర్వాహకులకు తెలిపారు అనంతరం క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా పలు జట్లను టోర్నమెంట్లు. పాల్గొన్న ఈ కార్యక్రమంలో లింగాపూర్ సర్పంచ్ ఇరవెల్లి శంకర్ టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాసెట్టి వీరేశం పాల్గొన్నారు.

## సంఘ భవన నిర్మాణానికి 15 లక్షల నిధులకై

## ఎమ్మెల్యే ను కలిసిన జగిత్యాల పద్మశాలి సేవా సంఘం

**జగిత్యాల ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** పద్మశాలి సేవా సంఘం జగిత్యాల వారు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గారిని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో కలిసి జగిత్యాల పద్మశాలి సేవా సంఘం నూతన భవన నిర్మాణానికి 15 లక్షల నిధులు



మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించి నిధుల మంజూరు కు హామీ ఇచ్చారు జగిత్యాల శాసనసభ్యులు డా.సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఆకుబత్తిని శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చింతకింది రవిచంద్, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, కోశాధికారి మానపురి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి భోగ రాజ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## బన్సీలాల్ పేటలో ప్రజా గోస - బీజేపీ భరోసా

**బీజేఆర్ నగర్‌లో స్ట్రీట్ కార్నర్ మీటింగ్**

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** సనత్ నగర్ నియోజకవర్గం బన్సీలాల్ పేట డివిజన్ లోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో ప్రజా గోస–బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ మీటింగ్ జరిగింది. ఈసందర్భంగా సికింద్రాబాద్ పార్లమెంటరీ బీజేపీ ఇంచార్జ్ తడిసిన రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజా



వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ సర్కార్ కు ఇవే చివరి రోజులని, మళ్ళీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టేసిన సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పనున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కుర్మ శంకర్, వై. సురేశ్, హరినాథ్, రవి టెండూల్కర్, ఎల్లకొండ శ్రీనివాస్, పృథ్వీరాజ్, పవన్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఉచిత వైద్యాన్ని అందించడం అభినందనీయం

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**

**భోలక్ పూర్ నిర్మాణ్ సంస్థ ఫ్రీ మెడికల్ క్యాంపు**

**సికింద్రాబాద్ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** నిరుపేదలకు ఉచిత వైద్యం అందించేందుకు కార్పొరేట్ కంపెనీలు సీఎస్ఆర్ స్కీం కింద ఉచిత వైద్య శిభిరాలు నిర్వహించడం అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా



గోపాల్ అన్నారు. కోహెన్స్ లైఫ్ సైన్సెస్ సహాకారంతో నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భోలక్ పూర్ గంగపుత్ర సంఘంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరాన్ని ఆయన ప్రారంభించారు. శిభిరంలో మొత్తం 621 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందచేశారు. కార్యక్రమంలో కోహెన్స్ లైఫ్ సైన్సెస్ కార్పొరేట్ ఎఫైర్స్ వైస్ ప్రెసిడెంట్ పీసపాటి రవికుమార్, నిర్మాణ్ సంస్థ ఆర్గనైజర్స్ డాక్టర్ రాజేశ్, డా.అపర్ణ, అజయ్, ఎస్.ఆర్.డీ. ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, ఇందిరా భారతి, తదితరులు పాల్గొన్నారు.

## శంకుస్థాపనకు వచ్చిన మంత్రి కే.టి.ఆర్. స్వాగతం పలికిన ఎమ్మెల్యే, కార్యకర్తలు

**తరిగొప్పుల ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** ఎగువ ప్రాంతాలైన తరిగొప్పుల, వేలేరు, చిల్పూరు మండలాలలో పలు గ్రామాలకు సాగునీరు అందించడానికి



పంట పొలాలను సస్యశ్యామలం చేయడానికి 104.94 కోట్ల అంచనా వ్యయంతో శంకుస్థాపన కు వచ్చిన ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కు స్వాగతం పలకడానికి జనగాం నియోజకవర్గం శాసనసభ్యులు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి మరియు తరిగొప్పుల మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బి రెడ్డి జాజిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి మండల ఎంపీపీ, జడ్పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయి “అంబాసిడర్ ఆఫ్ గుడ్ విల్” అవార్డు పొందిన ప్రముఖ న్యాయవాది కటుకం

**కోరుట్ల ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** సామాజిక సేవరంగంలో విశిష్ట సేవలను అందజేస్తున్న అసోసియేషన్ ఆఫ్ లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్, కోరుట్ల పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కటుకం రాజేంద్రప్రసాద్ కు సంస్థ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అలై, వి.యం. రావు, “అంబాసిడర్ ఆఫ్ గుడ్ విల్’



అంతర్జాతీయ స్థాయి అవార్డ్ ను ప్రధానం చేసారు. ఈ సందర్భంగా సంస్థ పాస్ట్ ఇంటర్నేషనల్ ప్రెసిండెంట్స్ అలై. బి. తరువాతి రావు, అలై. డా. శాంతమ్మ, అలై. అవినాష్ చంద్ర ఓరీ, ఇంటర్నేషనల్ సెక్రటరీ అలై కె. రాజేశ్వర్ రావు ఇంటర్నేషనల్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ అలై.డి. డా. డి. బాల గంగాదర శాస్త్రి, జిల్లా 137బి కరీంనగర్ ప్రతినిధులు అలయన్స్ క్లబ్ కోరుట్ల ప్రతినిధులు, సభ్యులు, అభినందనలు తెలిపి హర్షం వ్యక్తం చేసారు.

## ప్రజావాణి ఆర్జీలను వెంటనే పరిష్కరించాలి

**కలెక్టర్ సిహెచ్. శివ లింగయ్య**

**జనగామ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** జనగామ జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు చేసుకున్న ఆర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, వారి పరిధిలో లేకుంటే



ఆర్జీదారులకు సమస్యల పరిష్కారం కోసం సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా సంబంధిత జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. అంతరం సదరం క్యాంపు ద్వారా నిర్వహించిన అర్హులైన వికలాంగుల సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవిన్యూ డివిజన్ అధికారులు మధుమోహన్, కృష్ణవేణి, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.రామ్ రెడ్డి, ఎన్పిడిసీఎల్ ఎస్ ఈ వేణుమాధవ్, డిపిఓ వసంత, సిపిఓ ఇస్మాయిల్, డిఎఓ వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రజిత,డిఎస్ఓ రోజా రాణి, డిఎం సంధ్యారాణి, జిల్లా అధికారులు అన్ని శాఖల విభాగాల సిబ్బంది కలెక్టరేట్ పరిపాలన అధికారి మన్సూరి, ఏతేషామ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

# గిర్నితండాలో విషాదఛాయలు : ఆందోళనకు దిగిన ప్రజాసంఘాలు

**జనగామ,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** మెడికల్ స్టూడెంట్ ప్రీతి మృతితో జనగామ జిల్లా గిర్నితండాలో విషాద ఛాయలు నెలకొన్నాయి. హైదరాబాద్ నుండి భారీ భద్రత నడుమ ప్రీతి మృతదేహాన్ని సోమవారం ఉదయం గిర్నీతండాకు తరలించారు. ఆమె డెడ్ బాడీని చూసిన కుటుంబసభ్యులు, బంధువులు గుండెల పగిలేలా రోదించారు. గ్రామస్తులు విద్యార్థులు, గిరజన సంఘాలు అక్కడికి చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ బిడ్డను హత్య చేశారని ప్రీతి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇక ప్రీతి మృతిపై రాష్ట్ర సర్కారు ఇప్పటివరకూ స్పందించకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎంజీఎం నుంచి నిమ్స్ వరకు ప్రతీది డ్రామానే క్రియేట్ చేశారని మండిపడుతున్నారు. ప్రీతి మృతి కారణమైన సైఫ్ ను కఠినంగా శిక్షించాలని గిరిజన, ప్రజా సంఘాలు డిమాండ్ చేసాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో 90 రోజులలోపు నిందితుడికి శిక్ష విధించాలని కోరుతున్నాయి. బాధిత కుటుంబానికి రూ.5 కోట్ల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని కోరాయి. ఆందోళనల నేపథ్యంలో ప్రీతి స్వగ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా ప్రీతి అంత్యక్రియలు గిర్నితండాలో జరగనున్నాయి. మెడికో స్టూడెంట్ ప్రీతి కుటుంబంలో విషాదఛాయలు అలుముతున్నాయి. ప్రీతి ఇక లేదన్న విషయం ఆమె కుటుంబసభ్యులతో పాటు.. గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమె విషయంలో అంతా హైడ్రామా క్రియేట్ చేశారని.. నిందితుడిని తప్పించే ప్రయత్నంలోనే రిమాండ్‌కు పంపారని వారు ఆరోపిస్తున్నారు. ఏ విషయంలో అయినా ఆమె చాలా ధైర్యంగా ఉంటుందని.. ఒక గిరిజన అమ్మాయి డాక్టర్ స్థాయికి వెళ్లడం అంత సులభం కాదని ప్రీతి పిన్ని చెప్పారు. కావాలనే ఆమెను చంపేసి.. అంతా నాటకం ఆడారని ఆరోపించారు. ప్రీతికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిందితుల్ని శిక్షించాలని కోరారు.

# ప్రీతి విషయంలో సకాలంలో స్పందించలేదు

**అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి: జీవన్ రెడ్డి**

**హైదరాబాద్,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** పీజీ విద్యార్థి ప్రీతి ర్యాగింగ్‌కు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... సకాలంలో కాలేజ్ యాజమాన్యం, పోలీసులు స్పందించి ఉంటే ఈ ఘోరం జరిగి ఉండేది కాదన్నారు. తండ్రి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన తర్వాత కూడా పోలీసులు చర్య తీసుకోలేదని మండిపడ్డారు. వేధించిన వారిని మందలించి ఉంటే ఈ ఘోరం జరగేది కాదని అన్నారు. ప్రీతి మరణం విషయంలో మ్టటెవాడ పోలీస్ అధికారి, కాలేజ్ ప్రిన్సిపాల్, హెచ్.వొ.డిని నిందితులుగా చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కేసును సిట్ విచారణ జరిపించాలన్నారు. రక్షిత అనే ఇంజనీరింగ్ అమ్మాయి కూడా వేధింపులకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. ఈ కేసులో కూడా భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇలాంటి



ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం శాశ్వత చర్యలు తీసుకోవాలని అన్నారు. రెండు, మూడు నెలల్లో దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.

### పిసిసి మాజీ చీఫ్

# డిఎస్‌కు అనారోగ్యం

**హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు**

**హైదరాబాద్,ఫిబ్రవరి27(ప్రజామంటలు):** పీసీసీ మాజీ చీఫ్ డి. శ్రీనివాస్‌కు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. డీఎస్‌కు ఫిట్స్ రావడంతో ఆయన కుటుంబ సభ్యులు ఆయనను హుటాహుటిన సిటీ న్యూరో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స జరుగుతోంది. ఈ విషయాన్ని ఆయన కుమారుడు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ స్వయంగా ట్విటర్ వేదికగా వెల్లడించారు. తన తండ్రి తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారని.. ఆసుపత్రిలో చికిత్స జరుగుతోందని కాబట్టి రెండు రోజుల పాటు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనలేనని ట్విటర్ వేదికగా తన కార్యకర్తలకు తెలిపారు. నేడు రేపు తన కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకుంటున్నట్టు వెల్లడించారు. మా నాన్న డి. శ్రీనివాస్ గారు తీవ్ర అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు అని అరవింద్ తన ట్వీట్‌లో తెలిపారు.

### సిసోడియా అరెస్ట్

# బిజెపి దుర్మార్గాలకు పరాకాష్ట

**ఇడి,ఐటి, సిబైలు జేబు సంస్థలుగా మారాయి**

**మంత్రి జగదీశ్ రెడ్డి మండిపాటు**

**సూర్యాపేట,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** ఆప్ నేత, ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా అరెస్ట్ బీజేపీ దుర్మార్గాలకు పరాకాష్ట అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. బిజెపి పార్టీ నేతలు చేసిన ఆరోపణల కోసం కేంద్ర నిఘా సంస్థలు పనిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. కమలం పార్టీకి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ పాలనలో ఈడీ, ఐటీ, సీబీఐ వంటి సంస్థలు తమ స్వాతంత్యాన్ని కోల్పోయాయని విమర్శించారు. సూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత కొంతకాలంగా బీజేపీ నేతలు చేసిన ఆరోపణలపైనే ఎక్కువగా సీబీఐ ,ఈడీలు పనిచేస్తున్నాయని అర్థమవుతుందన్నారు. దేశంలో ఎమ్మర్జెన్సీకి మించిన దారుణమైన పరిస్థితులు కొనసాగుతున్నాయన్నారు. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు అప్రజాస్వామికమని మంత్రి అన్నారు. ఆ పార్టీ అరాచకాలు ఇలానే కొనసాగితే దేశ ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. అణచివేతలు, జైళ్లను నింపడం ద్వారా ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని చరిత్ర చెబుతుందని వెల్లడిం చారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక బొడ్రాయి పండుగ అని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. సూర్యాపేట మండలం రామచంద్రాపురంలో నిర్వహించిన బొడ్రాయి, కంఠమహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన



పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ తమతమ మతాచారాలకు అనుగుణంగా దైవ చింతనను కలిగి ఉండాలని చెప్పారు. దైవారాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వం లోని బీఆర్ఎస్ పాలనలో అన్ని మతాలకు సమ ప్రాధాన్యం లభిస్తుం దని చెప్పారు. మతాలకు అనుగుణంగా ప్రభుత్వమే పండుగలను నిర్వహించే సంస్కృతి తెలంగాణలో మాత్రమే ఉందన్నారు.

### ఇడి సిబిఐలను అప్పగిస్తే

# మోడీని జైల్లో పెడతా

**ఆప్ ఎమ్మెల్యే సంజయ్ సింగ్ సంచలన వ్యాఖ్య**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి27(ప్రజా మంటలు):** బీజేపీ ప్రభుత్వం తన అధికారాలను దుర్వినియోగం చేస్తోందని ఆప్ ఎమ్మెల్యే సంజయ్ సింగ్ ఆరోపించారు. ప్రతిపక్షాలపైనే దాడులు చేస్తున్న ఈడీ, సీబీఐ...బీజేపీ నేతలు, వారి కార్యాలయాలపై ఎందుకు దాడులు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ మేరకు ఢిల్లీ ఆప్ ఎమ్మెల్యే సంజయ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీబీఐ, ఈడీలను తనకు అప్పగిస్తే కేవలం రెండు గంటల్లోనే మోడీ, అమిత్ షా, ఆదానీలను జైల్లో వేస్తానని చెప్పారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పై బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రధాని మోడీ నియంత వలే వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం వ్యవహారంలో సీబీఐ అధికారులు ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను అరెస్ట్ చేశారు. మనీష్ సిసోడియా అరెస్ట్ ను నిరసిస్తూ ఆప్ ఎమ్మెల్యే సంజయ్ సింగ్ నేతృత్వంలో ఆప్ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. సీబీఐ కార్యాలయం ముందు బైఠాయించారు. కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారిని చెదరగొట్టే క్రమంలో పోలీసులు సంజయ్ సింగ్ ను అరెస్ట్ చేశారు. ఢిల్లీ డిప్యూటీ సీఎంగా ఢిల్లీలో ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరించినందుకు సిసోడియాను అరెస్ట్ చేశారా అని నిలదీశారు. ఇలాంటి చర్యలతో సీబీఐ, ఈడీలు ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**● పార్ట్ టైం అధ్యాపకుల సంఘం**

**హన్మకొండ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్ట్ టైం అధ్యాపకుల అధ్యక్షుడు డా. రాంబాబు మాట్లాడుతూ.... రెగ్యులర్ కోర్సులలో ఫుల్ వర్క్ లోడ్ తో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులను కాంట్రాక్ట్ అధ్యాపకులుగా అవకాశం కల్పించే ప్రక్రియలో అనేక అక్రమాలు జరిగిముడుపులు ముట్టాయని వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధార మన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పార్ట్ టైం అధ్యాపకులను కాంట్రాక్ట్ అధ్యాపకులుగా అవకాశం కల్పించాలని 2013 నుండి గత పది సంవత్సరాలుగా వివిధ రూపాలలో పోరాడుతున్నామన్నారు. ప్రొ. తాటికొండ రమేష్ కాకతీయ యూనివర్సిటీ కి వైస్ ఛాన్సలర్ అయిన తరువాత పార్ట్ టైం అధ్యాపకుల పక్షాన జీవో నెంబర్ 11 లో ఉన్న అర్హత ఉన్న 30 మంది పార్ట్ టైం అధ్యాపకులతో పాటు ఫుల్ వర్క్ లోడ్ తో అర్హత ఉన్న 120 మంది పార్ట్ టైం అధ్యాపకులకి కాంట్రాక్ట్ అధ్యాపకులుగా అవకాశం కల్పించడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో అవగాహన లేని కొంత మంది ఇచ్చిన తప్పుడు సమాచారం, ఆరోపణలు పూర్తిగా నిరాధారమన్నారు. మీరు నిర్వహించే ఎటువంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నాం మన్నారు. తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని విశ్వవిద్యాలయం అధికారులకి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ



కార్యక్రమంలో పార్ట్ టైం అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ డా. డి. నరేంద్రనాయక్ డా. తిరునహరి శేషు, డా. మయూరి శ్రీవాత్సవ తదితరులు పాల్గొన్నారు.











జగిత్యాల పట్టణం లోని శాతవాహన యు.పి.ఎస్. వాణీ నగర్ పాఠశాల నుండి విహార యాత్రకు వెళ్ళి కోరుట్ల అష్టలక్ష్మి దేవాలయము, సాయిబాబ టెంపుల్, వెంకటాపూర్ వెంకటేశ్వర టెంపుల్ లను దర్శించుకున్న విద్యార్థులు, పాఠశాల డైరెక్టర్ వనమాల రజని, ప్రిన్సిపాల్ గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసన్న, ఉపాధ్యాయినీలు లిఖిత, అరుణ, లహరి, పద్మ, తరుణి, శ్వేత, మమత లు

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా క్వాలిటీ కంట్రోల్



ఆఫీసర్ డాక్టర్ చొక్కయ్య సూచించారు. సోమవారం భీమదేవరపల్లి జెడ్పిహెచ్ఎస్ లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహిస్తూ విజయవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రికార్డులు, కంటి పరీక్షల నిర్వహణ, విధానాన్ని పరిశీలించారు.

## నూతన ఎంపిడిఓకు నియమాక పత్రం

**అందజేసిన జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత**

**జగిత్యాల ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కు బదిలీ పై వచ్చిన ఎ. రాజేందర్ కు సారంగాపూర్ మండల నూతన ఎంపిడిఓ గా



నియమాక పత్రం అందజేసిన జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత. సారంగాపూర్ మండములోని గ్రామాలలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి మండలం లోని ప్రజాప్రతినిధులు మరియు అధికారుల సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలని జెడ్పీ చైర్ పర్సన్ ఆదేశించారు.

## పల్లె ప్రగతి - గ్రామ పారిశుధ్య ప్రణాళిక

**చొప్పదండి ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండవ రోజున చొప్పదండి మండలం లోని సాంబయ్య పల్లి గ్రామంలో గ్రామ పారిశుధ్యం ప్రణాళిక తయారీలో భాగంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ శ్రీ చిలుక రవీందర్ ఎంపీపీ గారు హాజరై నారు. వారు మాట్లాడుతూ సాంబయ్య పల్లి గ్రామం లో పారిశుద్ధ్యం పై సమగ్ర సర్వే నివేదిక తయారు చేసినట్లుగా అన్ని గ్రామాలు కూడా పారిశుద్ధ్యం పై సమగ్ర సర్వే నివేదిక తయారు చేసి ఇంకా మిగిలిపోయిన పనులను గుర్తించి త్వరితగతిన పూర్తి



చేయాలని జిల్లాస్థాయిలో మన మండలాన్ని ముందు వరుసలో ఉంచాలని అన్నారు. పారిశుద్ధ్య ప్రణాళికలో భాగంగా నిర్దేశించిన ప్రొఫార్మా ప్రకారం ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల సౌకర్యం, ఇంకుడు గుంతల నిర్మాణం, తడి చెత్త పొడి చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ గ్రామంలోని వివిధ సంస్థల పారిశుద్ధ్య వసతులపై సమగ్ర సర్వే నిర్వహించి పారిశుద్ధ్య అంతరాలను, గుర్తించి, వాటికి ప్రజల సమక్షంలో పరిష్కారాలను సూచిస్తూ, అట్టి అవసరాలన్నింటినీ గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో చేర్చి గ్రామాన్ని సమగ్ర అభివృద్ధికి కృషి చేయుటకు గాను పలువురు టీం అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తపల్లి రామకృష్ణ, ఎంపీడీవో స్వరూప, ఎంపీఓ రాజగోపాల్, ఏపీఎం నర్మదా, ఏపిఓ రాజు, స్వచ్ఛభారత్ మిషన్ టీం సభ్యులు టి. రమేష్, కే. వేణు ప్రసాద్, కె. సురేందర్ రెడ్డి, శ్రీధర్, యూనిసెఫ్ క్లస్టర్ ఫెసిలిటేటర్ తాళ్ల వెంకటేష్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వివో ఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వరుస ఆఫర్లు కొట్టేస్తున్న పూజాహెగ్డే

సౌత్, నార్త్ అనే తేడా లేకుండా స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతోంది పూజా హెగ్డే. రిజల్ట్ ఎలా ఉన్నా.. ఆమెకు మాత్రం వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. తాజాగా పూజ లిస్టులోకి మరో మూవీ చేరుతోంది. తమిళ



హీరో ఆర్యకి జోడీగా కనిపించనుందనే టాక్ వినిపిస్తోంది. పదమూడేళ్ల క్రితం కార్తి హీరోగా నటించిన 'ఆవారా' చిత్రం అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచింది. దర్శకుడు లింగుస్వామి దీనికి సీక్వెల్ ప్లాన్ చేశాడు. ఈసారి కార్తి కాకుండా ఆర్య హీరోగా నటించబోతున్నాడు. అతనికి జంటగా పూజా హెగ్డే నటించనుందనే ప్రచారం కోలీవుడ్‌లో జరుగుతోంది. లింగుస్వామి చెప్పిన స్టోరీకి పూజ కనెక్ట్ అయ్యిందని, అందుకే సీక్వెల్‌కు సై అందనే వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం మహేష్ బాబు హీరోగా త్రివిక్రమ్ తీస్తున్న చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌లో జాయిన్ కానుంది. మరోవైపు.. సల్మాన్ ఖాన్‌తో కలిసి పూజ నటించిన 'కిసి కా భాయ్.. కిసి కి జాన్' ఏప్రిల్ 21న రిలీజ్ కానుంది.

## కాలం కలసిరాని కేతికశర్మ

టాలీవుడ్‌లో హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్న అందాల భామ కేతిక శర్మ. ఈ అమ్మడు యుట్యూబర్‌గా కెరియర్ స్టార్ట్ చేసి షార్ట్ వీడియోల ద్వారా సోషల్ మిడియాలో భాగా పాపులర్ అయ్యింది. షార్ట్ వీడియోలలో ఈమె చేసే అందాల ప్రదర్శనకి విపరీతంగా నెటిజన్లు ఫ్యాన్స్ అయిపోయారు. దీంతో నటిగా తన అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నం మొదలు పెట్టింది. మొదటిగా అల్లు అర్జున్ ఆహా ఒటీటీ ప్రోమోగా ఈ బ్యూటీ కనిపించింది. తరువాత పూరి జగన్నాథ్ తన కొడుకుతో నిర్మించిన రొమాంటిక్ సినిమాలో ఈ అమ్మడుకి అవకాశం ఇచ్చారు. ఇందులో హద్దులు పెట్టుకోకుండా అందాల ప్రదర్శన చేసిన కేతిక శర్మకి కలిసి రాలేదు.



సినిమా డిజాస్టర్ అయ్యింది. తరువాత నాగ శౌర్య హీరోగా తెరకెక్కిన లక్ష్య సినిమాలో ఈ బ్యూటీ హీరోయిన్ గా నటించింది. అయితే ఆ మూవీ కూడా ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. ఇక మూడో ప్రయత్నంలో ఏకంగా మెగా హీరో వైష్ణవ్ తేజ్ కి జోడీగా రంగరంగ వైభవంగా అనే సినిమాలో నటించింది. ఈ మూవీలో డీసెంట్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకున్న కేతికకి కలిసి రాలేదు. దీంతో నటిగా ఈ బ్యూటీకి మొదటి మూడు సినిమాలతో హ్యాట్రిక్ ఎ÷-లాప్స్ ఖాతాలో పడ్డాయి. అయినా కూడా ఆమె తన ప్రయత్నాలు మాత్రం ఆపడం లేదు. ప్రస్తుతం సాయి ధరమ్ తేజ్ పవన్ కళ్యాణ్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న వినోదాయ సీతమ్ రీమేక్ లో కేతికకి ఛాన్స్ దొరికినట్లు టాక్ వినిపిస్తుంది. ఇదిలా ఉంటే తనకి పాపులారిటీ తీసుకొచ్చిన సోషల్ మిడియాని తనని తాను మరింత గ్రాండ్ గా ఎస్టాబ్లిష్ చేసుకోవడానికి ఉపయోగించుకుంటుంది. అందులో భాగంగా అందాల ప్రదర్శనకి ఎలాంటి హద్దులు పెట్టుకోకుండా ఈ బ్యూటీ రెచ్చిపోతుంది. తాజాగా వైట్ కలర్ టైట్ బ్లౌజ్ లో కేతిక ఎద అందాలని చూపిస్తూ ఆశ్వాదించమని హాట్ హాట్ గా రెచ్చిపోయింది. బరువైన ఎద సొగసులు ఈమెకి ఆభరణంగా అదనపు అందాన్ని ఇస్తూ ఉన్నాయనే మాట ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు చేస్తూ ఉండటం విశేషం. కరెక్ట్ గా వాడుకుంటే కేతిక మంచి గ్లామర్ హీరోయిన్ అవుతుందని కామెంట్స్ చేస్తున్నారు.

## చిన్న ఉపగ్రహాల అభివృద్ధిలో ధృవతార సంజయ్ నెక్కంటి

- సంజయ్‌కు ఉత్తమ శాస్త్రవేత్త అవార్డును అందించిన ఆకృతి సంస్థ

**హైదరాబాద్ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** అంతరిక్ష పరిశోధనలలో, చిన్న ఉపగ్రహాల అభివృద్ధిలో నిమగ్నమై రెండు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి విజయవంతంగా ప్రయోగించి దేశ గౌరవాన్ని పెంచిన సంజయ్ నెక్కంటి దేశం గర్వించదగ్గ యువ శాస్త్రవేత్త, యువ పారిశ్రామిక వేత్త అని రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. ప్రపంచంలోనే తొలిసారిగా అంతరిక్ష పరిశోధనలను ప్రైవేట్ రంగం ద్వారా నిర్వహించిన ఘనత సంజయ్ నెక్కంటి ఆధ్వర్యంలోని ధ్రువ స్పేస్ ప్రైవేటు లిమిటెడ్ కు దక్కింది అన్నారు. సోమవారం నాడు ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని సంజయ్ నెక్కంటికి ఆకృతి యువ ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారం అందజేసారు. ఈ కార్యక్రమం హైదర్ గూడ న్యూ సర్వీస్ సిండికేట్ (ఎన్.ఎస్.ఎస్.) లో జరిగింది. సమన్వయకర్తగా ఆకృతి సుధాకర్ వ్యవహరించగా, ముఖ్య అతిథిగా డా. వకుళాభరణం కృష్ణ మోహన్ రావు, విశిష్ట అతిది గా విచ్చేసిన మాజీ మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాస రావు, ప్రసంగిస్తూ భారతదేశం లో ప్రతిభకు కొదువ లేదు అన్నారు. సంజయ్ నెక్కంటి లాంటి ప్రతిభావంతులైన సైంటిస్టు లకు సహ కారం అందిస్తే నూతన ఆవిష్కరణ లు చేపట్టవచ్చు అన్నారు. కార్యక్రమం లో జూబ్లీ హిల్స్ వాసవి క్లబ్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్ రావు,దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. వకుళాభరణం ప్రసంగిస్తూ అంతరిక్ష పరిశోధనా రంగంలో తన 19 ఏళ్ళ వయస్సులోనే అధ్యయన పరిశోధనలు ఆరంభించిన నెక్కంటి సంజయ్ ప్రపంచంలోనే అతి చిన్న వయస్సులో అంతరిక్ష పరిశోధనలకు గాను స్టార్టప్ ను నెలకొల్పిన ఘనత సాధించారన్నారు. భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి ధృవ స్పేస్ సంస్థకు జాతీయ స్టార్టప్ అవార్డు ను అందజేయడం గమనించదగిందన్నారు. బెస్ట్ స్పేస్ టెక్ స్టార్టప్ గా ఎంట్రప్రెన్యూర్ ఇండియా మాగజైను ఎంపికజేయడం సంజయ్ కృషికి నిదర్శనం అన్నారు. యువ శాస్త్రవేత్త, పురస్కార గ్రహీత సంజయ్ నెక్కంటి మట్లాడుతూ.... వచ్చే 15 ఏండ్లలో అంతరిక్షంలోకి మనుషులను పంపించడమే కాకుండా అక్కడ, ఇక్కడి మాదిరిగా జీవించేటటువంటి దిశగా అనేక అధ్యయనాలు కొనసాగుతున్నాయని అవన్నీ విజయ వంతం అవుతాయని



ఆయన పేర్కొన్నారు. యువత క్రొత్త ఆలోచనలతో వైవిధ్యంగా తమ జీవన శైలిని మార్చుకుంటే అద్భుతాలు సృష్టించవచ్చు అన్నారు. తమ ధ్రువ స్పేస్ ప్రైవేటు లిమిటెడ్ ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుని అంతరిక్ష పరిశోధనలు కొనసాగిస్తున్నదని పేర్కొన్నారు. మానవ సమాజానికి అనునిత్యం ఉపయోగపడే అనేక క్రొంగొత్త ఆవిష్కరణలను అందుబాటులోకి తేబోతున్నామని అయన తెలిపారు.

## షీ టీం మరియు ఏహెచ్ టుయు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**జగిత్యాల ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా షీ టీం మరియు ఏహెచ్ టుయు ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ మెట్ పల్లి లో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మెట్ పల్లి ఎస్.ఐ.-%××% మన్మథ రావు మాట్లాడుతూ....పిల్లలకు చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. అటువంటి వారికి అండగా నిలిచేదే షీ టీం మరియు ఏహెచ్ టుయు అని జిల్లాలో ఎవరైన ఇంట లేదా బయట వివక్షత ఎదుర్కునట్లు అయితే షి టీం బృందాలకు తెలియపరిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచి వారి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.




సురక్షితమైన వాతావరణాన్ని అందించడం కోసం,మహిళలపై జరిగే నేరాలను అదుపు చేయడానికి రాష్ట్ర పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్ అధ్వర్యంలో జిల్లా పోలీస్ శాఖ అనేక చర్యలు చేపట్టడం జరుగుతుందని,ఇందులో ప్రత్యేకంగా లైంగిక నేరాలు,గృహ హింస,బాల్య నేరాలు మరియు సైబర్ నేరాలు వంటి సమస్యలకు నిర్దిష్ట పరిష్కారాలను అందించడం జరుగుతుందని తెలిపారు. వివక్షతకు గురయ్యే మహిళలకు భరోసా కల్పించి వారికి జరిగిన అన్యాయాన్ని పరిష్కరించే విధంగా జిల్లా పోలీసు శాఖ వెంటనే

**అవగాహన కలిగించిన అంశాలు:**

1. సేఫ్టీ మరియు సెక్యూరిటీ ఆఫ్ వుమెన్. 2. నేచర్ ఆఫ్ హెరాస్మెంట్. 3. షి టీమ్ ను కలిసే విధం. 4. వుమెన్ ట్రాఫికింగ్. 5. గుడ్ టచ్ అలాగే బ్యాడ్ టచ్. 6. చైల్డ్ మ్యారేజ్. 7. డయల్ 100 పై షీ టీమ్ బృందం వారు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఎస్ .ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ వాలీబెగ్, మహిళా కానిస్టేబుల్ సౌజన్య, ప్రిన్సిపల్, మరియు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డల పెండ్లిండ్లకు మేనమామలా కేసీఆర్

- ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**జగిత్యాల ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణానికి చెందిన 107 మంది ఆడబిడ్డలకు షాది ముభారక్ పథకం ద్వారా మంజూరైన 1 కోటి 7 లక్షల రూపాయలు చెక్కులను, 56 మందికి కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన 56 లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు జగిత్యాల పట్టణ రాయల్ ఫంక్షన్ హాల్ లో పంపిణీ చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. 2014 ముందు ఆడపిల్లల పెళ్లి చేయాలంటే పేదవాళ్లు అప్పు చేసి పెళ్లి చేసేవారని బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడబిడ్డలకు మేనమామగా మారి ఒక్క లక్ష 116 రూపాయలను పేద ప్రజలకు చెక్కుల రూపంలో నేరుగా ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపేందుకు ఈ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం ఆడబిడ్డలకు ఒక భరోసాగా ఉందని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆడబిడ్డలకు ఆర్థిక భరోసా ఇవ్వలేదని అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా టిఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మైనార్టీ పార్టీ అధ్యక్షులు అబ్దుల్



ఖాదర్ ముజాహిద్, కౌన్సిలర్ లు, కో ఆప్షన్ సభ్యులు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వర్మి కంపోస్ట్ ఎరువుల తయారీని ప్రోత్సహిద్దాం

**మహాదేవపూర్ ఫిబ్రవరి 27 (ప్రజామంటలు):** మహాదేవపూర్ గ్రామ పంచాయతీ లో తడి చెత్త నుండి సేంద్రీయ పద్ధతిలో వర్మి కంపోస్ట్ ఎరువును తయారీ చేసే ప్రక్రియ పూర్తయిందని సర్పంచ్ శ్రీపతి బాపు తెలిపారు. ఆనపాముల పెంపకం తడి చెత్త వ్యర్థాలను వాన పాములు ఆహారంగా తీసుకొని సారవంతమైన మట్టిని విసర్జిస్తాయని ఈ సర్జిత పదార్థాలను వర్మి కంపోస్ట్ ఎరువు అంటారని అన్నారు. సారవంతమైన నేలలు సేంద్రియ వ్యవసాయానికి వర్మి కంపోస్ట్ ఎరువులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు వర్మి కంపోస్ట్ ఎరువుల తయారీ లాభసాటిగా మలుచుకోవచ్చని గ్రామ పంచాయితీ ఆదాయం పెంచుకోవడానికి వర్మి కంపోస్ట్ ఒక వనరు లాంటిదని తయారైన వర్మి కంపోస్ట్ ఎరువును గ్రామపంచాయతీ ద్వారా వేలం వేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రజినీకాంత్ రెడ్డి కారోబార్ జరిగే రమేష్ గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## యూఎస్‌లో బిజీగా హీరో రామ్‌చరణ్

### అవకాశం వస్తే హాలీవుడ్‌లోనూ నటిస్తానని వెల్లడి

జక్కన్న తెరకెక్కించిన ఆర్‌ఆర్‌ఆర్ ప్రపంచ వ్యాప్తంగా సంచలనాలు సృష్టిస్తోంది. గతంలో ఏ సినిమాకు దక్కని పాపులారిటీ ప్రశంసలు ఈ మూవీకి వరల్డ్ వైడ్ గా దక్కుతున్న విషయం తెలిసిందే. ప్రపంచ ప్రఖ్యాత దర్శకులు టెక్నీషియన్స్ సినిమాపై ఇందులో నటించిన రామ్ చరణ్ ఎన్టీఆర్ లపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. స్టీవెన్ స్పీల్ బర్గ్ జేమ్స్ కెమెరూన్ వంటి ప్రఖ్యాత దర్శకులు ఆర్‌ఆర్‌ఆర్ ని కొరనియాడుతున్నారు. ఇప్పటికే గోల్డెన్ గ్లోబ్ అవార్డుని దక్కించుకుని చరిత్ర సృష్టించింది. తాజాగా ఆర్‌ఆర్‌ఆర్‌క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల్లో మొత్తం నాలుగు పురస్కారాల్ని దక్కించుకుని వరల్డ్ సినిమా ప్రముఖుల దృష్టిని ఆకర్షించింది. త్వరలో మార్చి 12న జరగనున్న ఆస్కార్ అవార్డుల్లో 'నాటు నాటు 'సాంగ్ కు గానూ బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్‌కు అడుగు దూరంలో వుంది. ఇదిలా వుంటే ఆర్‌ఆర్‌ఆర్ఆస్కార్ అవార్డు ఫంక్షన్ కోసం యుఎస్ వెళ్లిన రామ్ చరణ్ అక్కడి మీడియాలో సందడి చేస్తున్నాడు. అంతే కాకుండా పలు మీడియాలకు ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు ఇస్తూ ఆసక్తికర సమాధానాలు చెబుతున్నాడు. ఓ ప్రశ్నకు సమాధానంగా ..తాను అంగీకరించిన ఇండియన్ సినిమాలు పూర్తి చేశాక ఖచ్చితంగా హాలీవుడ్ సినిమా చేస్తానని చరణ్ చెప్పడం ఆసక్తికరంగా మారింది. దీంతో ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. ఇదిలా వుంటే మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూప్ అధినేత ఆనంద్ మహీంద్రా..రీసెంట్ గా రామ్ చరణ్ హాలీవుడ్ మీడియాతో ఇంటరాక్ట్ అవుతున్న ఓ వీడియోని షేర్ చేస్తూ 'చరణ్ ని గ్లోబల్ స్టార్' అంటూ సంబోధించారు. తన స్టేట్ మెంట్ ని రీ ట్వీట్ చేస్తూ సంపత్ నంది ..చరణ్ 'రచ్చ' ఇంట్రో సాంగ్ వీడియోని షేర్ చేశాడు. కొన్నేళ్ల క్రితం ఈ మూవీ కోసం చరణ్ ఇంట్రో సాంగ్ ని షూట్ చేశాం. అప్పుడే చంద్రబోస్ అన్న గ్లోబల్ స్టార్ అంటూ సంబోధించారు. ఆ మాటలు ఈ రోజు నిజమయ్యాయి. అంతా చరణ్ ని ఇప్పుడు గ్లోబల్ స్టార్ అంటూ పిలుస్తున్నారు' అని ట్వీట్ చేశాడు. దీన్ని రీట్వీట్ చేస్తున్న అభిమానులు సంపత్ నందికి ఓ అవకాశం ఇవ్వాలని ఫ్యాన్స్ మెచ్చే సినిమా చేస్తాడని చరణ్ ని డిమాండ్ చేస్తున్నారు. గ్లోబల్ స్టార్ గా ఎదిగిన చరణ్ ఇప్పుడున్న పరిస్థితుల్లో సంపత్ నందితో సినిమా చేయడం కష్టమనే కామెంట్ లు వినిపిస్తున్నాయి. చరణ్ తో సంపత్ నంది చేసిన 'రచ్చ'ఊర మాస్ సినిమా. రొటీన్ కంటెంట్ తో చాలా బోరింగ్ గా అనిపించింది. అయినా సరే మాస్ ఆడియన్స్ కి నచ్చడంతో కమర్షియల్ గా హిట్ అనిపించుకుంది. ఇన్నేళ్ల తరువాత మళ్లీ అతనితో చరణ్ సినిమా అన్నది అసాధ్యమనే కామెంట్ లు వినిపిస్తున్నాయి.

## ప్రైవేట్ ఆల్బమ్‌లతో బిజీగా రాహుల్ సిప్లిగంజ్

సింగర్ రాహుల్ సిప్లిగంజ్ తన పాటలతో కంటే ఎక్కువగా బిగ్ బాస్ ద్వారానే ప్రేక్షకులకు దగ్గరయ్యాడు. బిగ్ బాస్ షోలో భాగంగా ఒక సీజన్లో పాల్గొన్నారు. సీజన్ విన్నర్ ట్రోఫీ కొట్టి హాట్ టాపిక్ అయ్యాడు. ఇక ప్రస్తుతానికి ఆర్‌ఆర్‌ఆర్ నాటు నాటు సాంగ్ హిట్ ని సూపర్ గా ఎంజాయ్ చేస్తున్న రాహుల్ సిప్లిగంజ్.. తన తదుపరి ప్రాజెక్టుల మీద దృష్టి పెట్టాడు. ఒక పక్క సాంగ్స్ ప్రైవేట్ గా చేస్తూనే మరోపక్క సినిమాలు చేస్తున్నాడు. అదేవిధంగా ప్రైవేటు ఆల్బమ్స్ కూడా చేస్తూ బిజీ బిజీగా గడుపుతున్నాడు. ఇటీవల కృష్ణవంశీ రంగమార్తాండ సినిమాతో నటుడిగా మారిన రాహుల్ సిప్లిగంజ్.. మధ్యలో చాలా సినిమాల్లో నటించాడు. ఇప్పటికే కొన్ని సినిమాలు విడుదలయ్యాయి కూడా. అయితే ఇప్పుడు రాహుల్ సిప్లిగంజ్ దుబాయ్ నుంచి షేర్ చేసిన ఒక వీడియో హాట్ టాపిక్ అవుతోంది. దుబాయిలో బికినీ భామలతో కలిసి రాహుల్ సిప్లిగంజ్ డాన్స్ చేస్తూ ఒక వీడియోని షేర్ చేశాడు. దుబాయ్ అంటే ఇలానే ఉంటుందని చెబుతూ ఆయన దానికి ట్యాగ్ పెట్టాడు. ఒక పాట షూటింగ్ కోసం దుబాయ్ వచ్చామని ఈ పాటని భారీ ఎత్తున ప్లాన్ చేశారని రాహుల్ సిబ్లిగంజ్ చెబుతున్నాడు. ఈ పాటను ఎలా షూట్ చేస్తున్నామో చూడండి అంటూనే ఆయన ఒక శాంపిల్ వీడియో కూడా రిలీజ్ చేసినట్లుగా తెలుస్తోంది. ఆ వీడియోలో బికినీ భామలతో రాహుల్ సిప్లిగంజ్ రచ్చ చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. నిజానికి రాహుల్ సిప్లిగంజ్ కి నాటు నాటు సాంగ్ వల్ల నేషనల్ వైడ్ గా కూడా క్రేజ్ లభించింది. ఈ సాంగ్ కి సంగీతం అందించింది కీరవాణి అయినా పాడింది రాహుల్ సిప్లిగంజ్ కాలభైరవ కావడంతో వారిద్దరికీ కూడా మంచి క్రేజ్ అయితే లభిస్తోంది. దాన్ని ఇంటర్నేషనల్ వైడ్ గా వాడుకుందామని రాహుల్ సిప్లిగంజ్ ఫిక్స్ అయినట్లుగా అర్థమవుతుంది.

## అమెరికాలో పెళ్లి..సందడి చేసిన వెంకటేశ్, రామ్‌చరణ్

అమెరికాలో ఉన్న నటుడు రామ్‌చరణ్ అక్కడ జరిగిన ఓ పెళ్లి వేడుకలో సందడి చేశాడు. అయితే అదే వేడుకలో టాలీవుడ్ హీరో వెంకటేష్ కూడా ఉన్నారు. ఇక ఇద్దరూ ఈ పెళ్లి వేడుకలో పాల్గొని సరదా సరదాగా గడిపారు. రామ్ చరణ్ ను చూసిన వెంకీ మామ.. అవార్డులు అందుకున్న చరణ్ను ఈ సందర్భంగా అభినందించాడు. దీనికి చెర్రీ.. వెంకీ మామకు థ్యాంక్స్ చెప్పాడు. స్టేజిపై చరణ్ వెంకీ మామ పక్కపక్కనే నిల్చొని హంగామా చేశారు. ఇది చూసిన వారంతా తెగ ఎంజాయ్ చేశారు. ఇక వెంకటేష్ మైక్ తీసుకొని చరణ్ గురించి మాట్లాడుతూ.. నాటు నాటు అంటూ మన అందర్నీ గర్వపడేలా చేస్తున్నావు అన్ని అవార్డులు నీకే వస్తున్నాయి అంటూ సరదాగా కామెంట్స్ చేశారు. దీంతో చరణ్ థ్యాంక్యూ వెంకీ మామ అని అన్నారు. చరణ్ వెంకటేష్ స్టేజి మీద సరదాగా మాట్లాడిన వీడియో ప్రస్తుతం వైరల్ గా మారింది.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com